epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

సంపుటి : 19 సంచిక : 130 | 31-07-2026 శుక్రవారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | published from Nalgonda, circulated throughout Telanagana state | పేజీలు : 12 వెల: రూ. 1.00







## తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద...
# ప్రాజెక్టుల పూర్తి వివరాలు ఇవిగో!

అక్షరకలం హైదరాబాద్ :

- తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు, వాగులు, వంకలు



2

- తెలంగాణలోని పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ
- ఉత్తర తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం
- ఏపీలో పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్ష సూచన
- హైదరాబాద్‌లోనూ ఎడతెరిపి లేకుండా వర్షాలు పడతాయని అంచనా



అక్షరకలం హైదరాబాద్ :

తెలుగు రాష్ట్రాల్లో మరోసారి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ముఖ్యంగా తెలంగాణలోని పలు జిల్లాల్లో గురువారం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉన్నందున, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ఈ మేరకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం పలు జిల్లాలకు 'ఆరెంజ్ అలర్ట్' ప్రకటించింది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం.. మంచిర్యాల, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, భూపాలపల్లి,ములుగు, జగిత్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, – మిగతా2లో...

# తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్.. ఆ జిల్లాల్లో అతి భారీ వర్షాలు!

# '2034 వరకు నేనే సీఎం'..

## ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

- టీచర్ల సమస్యలు తన బాధ్యతన్న సీఎం
- విద్యార్థుల కోసం పోరాడాలని పిలుపు
- 55 రోజుల్లో 11 వేల మంది టీచర్లను నియమించామని వ్యాఖ్య
- ఆర్నెల్లకోసారి ఉపాధ్యాయ సంఘాలతో సమావేశం
- ప్రతి నెల ఒకటో తేదీన జీతాల హామీ

అక్షరకలం హైదరాబాద్ :



విద్యాశాఖలో సంస్కరణలు చేపడుతున్న ప్రతిసారీ కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తనపై విమర్శలు చేస్తున్నారని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. అయితే వారి సమస్యలను పరిష్కరించే బాధ్యత పూర్తిగా తనదేనని స్పష్టం చేశారు. ఇకపై ఉపాధ్యాయ సంఘాలు తమ వ్యక్తిగత సమస్యల కోసం కాకుండా విద్యార్థుల భవిష్యత్తు కోసం ప్రభుత్వాన్ని ప్రశ్నించాలని పిలుపునిచ్చారు. ఫిన్‌లాండ్, జర్మనీ పర్యటన ముగించుకుని వచ్చిన ఉపాధ్యాయుల బృందంతో ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో జరిగిన సమావేశంలో – మిగతా2లో...



2

## పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి

### కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ

పంచాయతీలకు కేంద్రం విడుదల చేస్తున్న నిధులను పక్కదారి పట్టిస్తున్నారన్న బండి సంజయ్

నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలని సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆరోపణ

నిధుల దుర్వినియోగంపై విచారణజరిపించాలన్న బండి సంజయ్

అక్షరకలం హైదరాబాద్ :

## తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్.. వేలాదిగా పేరుకుపోయిన దరఖాస్తులు

- తెలంగాణలో పేరుకుపోతున్న ఫ్యామిలీ రిజిస్టర్ సర్టిఫికెట్ దరఖాస్తులు
- రెండు రోజుల్లో జారీ చేయాలన్న నిబంధన అమలు కాని వైనం
- రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో 50,000కు పైగా దరఖాస్తులు

అక్షరకలం హైదరాబాద్ :

2

## విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం: ఖర్గే

అక్షరకలం న్యూఢిల్లీ :

- రాజ్యసభకు పబ్లిక్ ఎగ్జామినేషన్స్ సవరణ బిల్లు
- కేంద్రంపై ప్రతిపక్ష నేత ఖర్గే విమర్శలు
- అమిత్ షా వివరణ ఇవ్వాలని డిమాండ్
- రాజకీయాల కోసమే బిల్లు తెచ్చారని ఆరోపణ
- పేపర్ లీక్‌లపై అమలు వ్యవస్థ బలోపేతం చేయాలని సూచన
- విద్యార్థుల ఉద్యమం వల్లే ప్రభుత్వం దిగివచ్చిందన్న ఖర్గే



2

## బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్.. టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు..

# తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు

- ప్రయాణికుల కోసం 'ఫస్ట్ మైల్, లాస్ట్ మైల్' కనెక్టివిటీకి ఆర్టీసీ శ్రీకారం
- ఇంటి నుంచి బస్టాప్‌కు, బస్టాప్ నుంచి గమ్యానికి ఈ-ఆటో సేవలు
- బస్ టికెట్‌తో కలిపి ఆటో రైడ్ బుక్ చేసుకునే ప్రత్యేక సౌకర్యం
- మొదట హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా, తర్వాత ఇతర నగరాలకు
- వేట్ యాప్‌ల కన్నా తక్కువ ఛార్జీలతో సేవలు అందించేలా ప్రణాళిక

2

అక్షరకలం హైదరాబాద్ :



## తిరుమల భక్తులకు బిగ్ అలర్ట్: సర్వదర్శనానికి ఎన్ని గంటల సమయం పడుతుందంటే..!

- తిరుమలలో భారీగా పెరిగిన భక్తుల రద్దీ
- శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం
- నిండిపోయిన వైకుంఠం క్యూ కాంప్లెక్స్ కంపార్ట్‌మెంట్లు
- నిన్న శ్రీవారిని దర్శించుకున్న 74,471 మంది భక్తులు
- ఒక్కరోజే రూ.4.68 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం

అక్షరకలం హైదరాబాద్ :

తిరుమల శ్రీవారి దర్శనానికి భక్తులు భారీగా తరలివస్తున్నారు. దీంతో తిరుమల గిరులు భక్తుల రద్దీతో కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని కంపార్ట్‌మెంట్లన్నీ పూర్తిగా నిండిపోవడంతో, టోకెన్లు లేని భక్తులు వెలుపల క్యూలైన్లలో వేచి ఉన్నారు.ప్రస్తుతం శ్రీవారి సర్వదర్శనా – మిగతా2లో...

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ‘2034 వరకు నేనే సీఎం’..

## ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ కీలక హామీ

-మొదటి పేజీ తరువాయి

ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులకు తాను ఒక్కటే చెబుతున్నానని రేవంత్ అన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి. మీరు అడగకముందే వాటిని పరిష్కరిస్తాను. ప్రమోషన్లు, బదిలీలు కూడా మీ ఇంటి వద్దకే పంపించాం. ఇకపై మీకోసం కాదు.. విద్యార్థుల సమస్యల కోసం నాతో కొట్లాడండి” అని సూచించారు. విద్యా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషించాలని కోరారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని వ్యాఖ్యానించిన రేవంత్ రెడ్డి, ఆ లోపు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పూర్తి బాధ్యత వహిస్తానన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కేవలం 55 రోజుల్లో 11 వేల మంది ఉపాధ్యాయులను నియమించామని గుర్తు చేశారు. ఇలాంటి నియామకాలు గతంలో ఎప్పుడైనా జరిగాయా అని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం ఉపాధ్యాయులదేనని, అందుకే వారి సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. రాబోయే ఐదేళ్లలో తెలంగాణ విద్యాశాఖను ప్రపంచ దేశాలు ఆదర్శంగా చూసే స్థాయికి తీసుకెళ్లాలని రేవంత్ పిలుపునిచ్చారు. పంచవర్ష ప్రణాళిక తరహాలో ఉపాధ్యాయ సంఘాలు ప్రతిజ్ఞ చేసి పని చేయాలని కోరారు. అలాంటి కృషి చేస్తే విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని అన్నారు. దేశానికి విద్య, వైద్య రంగాల్లో తెలంగాణే నాయకత్వం ఎందుకు ఇవ్వకూడదని ప్రశ్నించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఉపాధ్యాయ సంఘాల నాయకులతో నేరుగా చర్చిస్తానని సీఎం హామీ ఇచ్చారు. వారి సమస్యల పరిష్కారానికి క్రమం తప్పకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు. గతంలో ఒకటో తేదీన ఉద్యోగుల జీతాలు సమయానికి పడేవి కాదని, ఇప్పుడు మాత్రం అడగకుండానే ప్రతి నెల ఒకటో తారీఖున జీతాలు జమ చేస్తున్నామని తెలిపారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కూడా అదే రోజు వేతనాలు చెల్లిస్తున్నామని వెల్లడించారు.

## తెలంగాణ జలాశయాలకు పోటెత్తుతున్న వరద... ప్రాజెక్టుల పూర్తి వివరాలు ఇవిగో!

-మొదటి పేజీ తరువాయి

జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టులకు భారీగా వరద నీరు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నదులు, వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. ప్రధాన జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం పెరుగుతుండటంతో పాటు జూరాల, శ్రీరాంసాగర్, నిజాంసాగర్, సింగూరు ప్రాజెక్టుల నీటిమట్టాలు వేగంగా పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో జలపాతాలు, నదీ తీర ప్రాంతాల వద్ద పర్యాటకులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. వివిధ జలాశయాల ప్రస్తుత పరిస్థితి వివరాలు: జూరాల ప్రాజెక్టు (మహబూబ్‌నగర్): ఇన్‌ఫ్లో: 91,000 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 81,695 క్యూసెక్కులు (10 గేట్లు ఎత్తివేత). నీటిమట్టం: గరిష్ఠంగా 318.516 మీటర్లకు గాను ప్రస్తుతం 317.35 మీటర్లకు చేరింది. నీటి నిల్వ: పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.371 టీఎంసీలు నమోదైంది. ఎగువ, దిగువ విద్యుత్ కేంద్రాల్లోని 11 యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతోంది. భద్రాచలం వద్ద గోదావరి ఉధృతి: ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 27.4 అడుగులకు చేరడంతో తీరప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్): ఇన్‌ఫ్లో: 6,250 క్యూసెక్కులు. నీటిమట్టం: పూర్తిస్థాయి 1091 అడుగులకు గాను ప్రస్తుతం 1065 అడుగులు ఉనంది. 80 టీఎంసీల సామర్థ్యానికి గాను 16 టీఎంసీల నిల్వ ఉంది. నిజాంసాగర్ ప్రాజెక్ట్ (నిజామాబాద్): ఇన్‌ఫ్లో: 3,935 క్యూసెక్కులు. నీటిమట్టం: పూర్తిస్థాయి 1405 అడుగులకు గాను ప్రస్తుతం 1395.83 అడుగులకు చేరింది. 17.802 టీఎంసీల సామర్థ్యానికి గాను 7.146 టీఎంసీల నీరు నిల్వ ఉంది (గత ఏడాది ఇదే సమయానికి 4.622 టీఎంసీలుగా ఉంది). సింగూరు ప్రాజెక్టు (సంగారెడ్డి): ఇన్‌ఫ్లో: 517 క్యూసెక్కులు. ఔట్‌ఫ్లో: 470 క్యూసెక్కులు. నీటి నిల్వ: 29.9 టీఎంసీల పూర్తి సామర్థ్యానికి గాను ప్రస్తుతం 4.249 టీఎంసీల నీటి నిల్వ

## తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్.. ఆ జిల్లాల్లో అతి భారీ వర్షాలు!

-మొదటి పేజీ తరువాయి

నమోదైంది.తెలంగాణకు ఆరెంజ్ అలర్ట్.. ఆ జిల్లాల్లో అతి భారీ వర్షాలు!
సిద్దిపేట జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. అదే సమయంలో సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, వికారాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ‘ఎల్లో అలర్ట్’ జారీ చేస్తూ, అక్కడ భారీ వర్షాలు నమోదవుతాయని వెల్లడించింది. ఇక హైదరాబాద్ మహానగరంలోనూ ఎడతెరిపి లేకుండా వర్షం కురిసే అవకాశాలు ఉన్నందున, నగరవాసులు అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని అధికారులు విజ్ఞప్తి చేశారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లోనూ వర్షాలు కురుస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (APSDMA) వెల్లడించింది. సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలవరం, తూర్పు గోదావరి, ఏలూరు జిల్లాల్లో కొన్ని చోట్ల మోస్తరు వర్షాలు కురుస్తాయి. శ్రీకాకుళం, మన్యం, అల్లూరి, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆయన వివరించారు.

## తిరుమల భక్తులకు బిగ్ అలర్ట్: సర్వదర్శనానికి ఎన్ని గంటల సమయం పడుతుందంటే..!

-మొదటి పేజీ తరువాయి

సుమారు 12 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు వెల్లడించారు. క్యూలైన్లలో గంటల తరబడి వేచి ఉన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. వారికి నిరంతరాయంగా పాలు, తాగునీరు, అల్పాహారం పంపిణీ చేస్తున్నారు. బుధవారం ఒక్కరోజే స్వామివారిని 74,471 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 31,319 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.4.68 కోట్ల ఆదాయం సమకూరినట్లు టీటీడీ వెల్లడించింది.

# పంచాయతీ నిధుల పక్కదారిపై పూర్తి విచారణ జరపాలి: కేంద్ర, రాష్ట్ర మంత్రులకు బండి సంజయ్ లేఖ

-మొదటి పేజీ తరువాయి

తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు కేంద్ర ఆర్థిక సంఘం విడుదల చేస్తున్న నిధుల వినియోగంలో తీవ్ర అక్రమాలు జరుగుతున్నాయని, మార్గదర్శకాలకు విరుద్ధంగా నిధులను పక్కదారి పట్టిస్తున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆరోపించారు. కేంద్ర నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఖర్చు చేయాలంటూ పంచాయతీ అధికారులపై, సర్పంచులపై ఒత్తిళ్లు తెస్తున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిధుల దుర్వినియోగంపై పూర్తిస్థాయి నిష్పాక్షిక విచారణ జరిపించాలని కోరుతూ కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్, రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్కలకు బండి సంజయ్ లేఖలు రాశారు. సర్పంచులు తమకు ఎదురవుతున్న ఒత్తిళ్లపై ఆధారాలతో సహా ఇచ్చిన ఫిర్యాదులను లేఖలకు జత చేసినట్లు ఆయన తెలిపారు. “గ్రామీణ వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి పంచాయతీరాజ్ వ్యవస్థే మూలస్తంభం. ఇక్కడ నిధులు పక్కదారి పడితే గ్రామాల అభివృద్ధి స్తంభించిపోవడమే కాకుండా, పంచాయతీల ఆర్థిక స్వయం ప్రతిపత్తి దెబ్బతింటుంది” అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు తక్షణమే జోక్యం చేసుకుని, ఆధారాల ఆధారంగా పూర్తిస్థాయి విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు.

# తెలంగాణలో కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్.. వేలాదిగా పేరుకుపోయిన దరఖాస్తులు

-మొదటి పేజీ తరువాయి

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన కుటుంబ రిజిస్టర్ సర్టిఫికెట్ (ఎఫ్ఆర్‌సీ) జారీ ప్రక్రియలో జాప్యం నెలకొంది. దరఖాస్తు చేసుకున్న రెండు పనిదినాల్లోనే ధ్రువీకరణ పత్రం అందజేయాలని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినప్పటికీ, క్షేత్రస్థాయిలో గడువు పాటించకపోవడంతో వేలాది దరఖాస్తులు పెండింగ్‌లో పడ్డాయి. పథకం ప్రారంభమైన జూలై 27 నుంచి బుధవారం వరకు రాష్ట్రవ్యాప్తంగా మీసేవ కేంద్రాల ద్వారా 50 వేలకు పైగా దరఖాస్తులు అందాయి. తొలిరోజే దరఖాస్తు చేసుకున్న వారికి సైతం ఇప్పటివరకు సర్టిఫికెట్లు అందకపోవడంతో, వారు నిత్యం మీసేవ కేంద్రాల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోంది. ఫలితంగా దరఖాస్తుదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. గత నెల 25న విడుదల చేసిన జీవో 172 నిబంధనల ప్రకారం, దరఖాస్తు అందిన రెండు పనిదినాల్లోగా సంబంధిత తహశీల్దార్లు వాటిని పరిశీలించి సర్టిఫికెట్లను జారీ చేయాలి. అయితే, పలు ప్రాంతాల్లో ఈ నిబంధన అమలు కావడం లేదు.

### -సర్టిఫికెట్ జారీ ప్రక్రియ ఇదే

పౌరసరఫరాల శాఖ వద్ద ఉన్న రేషన్ కార్డుల సమాచారం ఆధారంగా ప్రభుత్వం ‘తెలంగాణ ఫ్యామిలీ రిజిస్టర్’ను సిద్ధం చేసింది. పౌరులు మీసేవ కేంద్రాలలో దరఖాస్తు చేసుకోగానే, ఆ దరఖాస్తు నేరుగా సంబంధిత తహశీల్దార్ లాగిన్‌లోకి వెళ్తుంది. అక్కడ తహశీల్దార్ ఆ వివరాలను రేషన్ కార్డు డేటాతో సరిపోల్చి చూసి, అంతా సక్రమంగా ఉంటే డిజిటల్ సంతకంతో ధ్రువీకరణ పత్రాన్ని జారీ చేయాలి. కానీ, తహశీల్దార్ల స్థాయిలో ఈ ప్రక్రియ మందకొడిగా సాగుతుండటంతో దరఖాస్తుల సంఖ్య భారీగా పేరుకుపోతోంది.

# విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం: ఖర్గే

-మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వ పరీక్షల్లో ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు తీసుకొచ్చిన పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) సవరణ బిల్లు-2026పై రాజ్యసభలో తీవ్ర వాగ్వాదం జరిగింది. చర్చ సందర్భంగా ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఘాటు విమర్శలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కంటే రాజకీయాలకే ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చిందని ఆరోపించారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై పోలీసులు వ్యవహరించిన తీరుపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభలో వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో నిరసన తెలిపిన విద్యార్థులపై లాఠీచార్జి జరిగిందని ఖర్గే ఆరోపించారు. ఢిల్లీ పోలీసులు, సీఆర్‌పీఎఫ్ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ పరిధిలోనే పనిచేస్తాయని గుర్తు చేశారు. ఆ శాఖ అనుమతి లేకుండా ఇలాంటి చర్యలు జరిగే అవకాశం లేదని అన్నారు. ఈ ఘటనపై అమిత్ షా బాధ్యత నుంచి తప్పించుకోలేరని వ్యాఖ్యానించారు. విద్యార్థులపై జరిగిన పోలీసు చర్యలపై ఆయన సభలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టే బిల్లును ఇంత ఆలస్యంగా ఎందుకు తీసుకొచ్చారని ఖర్గే ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును కాపాడే సంస్కరణలు చేయకుండా ప్రభుత్వం రాజకీయాల్లోనే నిమగ్నమైందని విమర్శించారు. ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనలను చల్లార్చేందుకే ఈ బిల్లును తీసుకొచ్చారని ఆరోపించారు. బీజేపీ రాజకీయాల వల్లే దేశంలో ప్రశ్నపత్రాల లీకేజీలు, నిరసనలు, పోలీసు చర్యలు చోటుచేసుకున్నాయని అన్నారు. పేపర్ లీకేజీలు జరిగిన తర్వాత నష్టనివారణ చర్యలు తీసుకోవడం ఒక్కటే సరిపోదని ఖర్గే అభిప్రాయపడ్డారు. అలాంటి ఘటనలు మళ్లీ జరగకుండా అమలు వ్యవస్థను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రశ్నపత్రాల లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం అనుసరించబోయే స్పష్టమైన కార్యాచరణను వివరించలేదని విమర్శించారు. ఈ బిల్లు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతుందా అన్న సందేహాన్ని వ్యక్తం చేశారు. గత రెండు నెలలుగా విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా పరీక్షల వ్యవస్థపై నిరసనలు వ్యక్తం చేశారని ఖర్గే గుర్తుచేశారు. వారి గొంతుకను ప్రతిపక్షం వీధుల నుంచి పార్లమెంట్ వరకు వినిపించిందన్నారు. ప్రజల ఒత్తిడి పెరగడంతో ప్రభుత్వం చివరకు వెనక్కి తగ్గిందని వ్యాఖ్యానించారు. విద్యార్థుల పోరాటం ఫలించిందని, వారి ఉద్యమం వల్లే ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చిందని అన్నారు. అధికారాన్ని కోల్పోతామన్న భయంతోనే ప్రభుత్వం డిమాండ్లకు తలొగ్గిందని ఆరోపించారు.

# బస్ టికెట్‌తో పాటే ఆటో బుకింగ్.. టీజీఎస్ఆర్టీసీ సరికొత్త సేవలు.. తక్కువ ఛార్జీలతో ఎలక్ట్రిక్ ఆటోలు

-మొదటి పేజీ తరువాయి




తెలంగాణలో ప్రజా రవాణాను మరింత సులభతరం చేసే దిశగా టీజీఎస్ఆర్టీసీ మరో విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. బస్సు ప్రయాణికులకు ఇంటి నుంచి బస్ స్టాప్ వరకు, బస్సు దిగాక గమ్యస్థానం వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రయాణాన్ని కొనసాగించేందుకు ‘ఫస్ట్ మైల్ టు లాస్ట్ మైల్’ కనెక్టివిటీ విధానాన్ని అమలు చేయనుంది. ఇందులో భాగంగా త్వరలోనే రాష్ట్రంలో ఎలక్ట్రిక్ ఆటోలను ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ప్రముఖ ఎలక్ట్రిక్ ఆటో తయారీ కంపెనీలతో ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్చలు జరుపుతున్నారు. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన వెంటనే ఈ-ఆటోలు రోడ్డెక్కనున్నాయి. ఈ కొత్త విధానంలో ప్రయాణికులు తమ బస్ టికెట్‌ను బుక్ చేసుకునే సమయంలోనే అదనంగా ఆటో రైడ్‌ను కూడా ఒకేసారి బుక్ చేసుకునేలా ప్రత్యేక సౌకర్యం కల్పించనున్నారు. దీని ద్వారా ప్రయాణికులను వారి నివాసం నుంచి సమీప బస్ పాయింట్‌కు, అలాగే బస్సు దిగిన తర్వాత అక్కడి నుంచి వారి చివరి గమ్యస్థానానికి ఈ-ఆటోలు సురక్షితంగా చేరవేస్తాయి. ఫలితంగా ప్రయాణికులకు విలువైన సమయం ఆదా అవడంతో పాటు బస్టాప్‌లకు చేరుకోవడానికి, అక్కడి నుంచి గమ్యస్థానాలకు వెళ్లడానికి పడే ప్రయాసలు తప్పుతాయి. ఈ ఎలక్ట్రిక్ ఆటో సేవలను ప్రయోగాత్మకంగా తొలుత గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. ఇక్కడ లభించే స్పందన, ఫలితాల ఆధారంగా రెండో దశలో వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్ వంటి రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాలకు దశలవారీగా విస్తరించాలని యోచిస్తున్నారు. ముఖ్యంగా ప్రస్తుతం నగరంలో అధిక ఛార్జీలతో నడుస్తున్న ఓలా, ఉబర్, ర్యాపిడో వంటి ప్రైవేట్ రైడ్ హెయిలింగ్ యాప్‌ల కన్నా గణనీయంగా తక్కువ ఛార్జీలతో ఈ సేవలను అందించేందుకు ఆర్టీసీ ప్రణాళికలు రూపొందిస్తోంది. ఈ నిర్ణయం వల్ల హైదరాబాద్ శివారు ప్రాంతాలైన ఎల్బీనగర్, ఉప్పల్, మియాపూర్, పటాన్‌చెరు, శంషాబాద్, ఘట్‌కేసర్ వంటి కనెక్టివిటీ సమస్యలున్న ప్రాంతాల ప్రజలకు గొప్ప ఊరట లభించనుంది. ప్రజా రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఆర్టీసీ ఈ-ఆటోల నిర్ణయం ఒక మైలురాయిగా నిలుస్తుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# నాగర్‌కర్నూల్ నూతన ఎస్పీగా వెంకట్ రెడ్డి బాధ్యతల స్వీకారం

అక్షర కలం నాగర్‌కర్నూల్ ప్రతినిధి:-

నాగర్‌కర్నూల్ జిల్లా పోలీస్ శాఖలో నూతన ఎస్పీగా వెంకట్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తానని తెలిపారు. మహిళలు, పిల్లలపై నేరాలు, గంజాయి, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాల కట్టడికి ప్రత్యేక చర్యలు తీసుకుంటానని చెప్పారు. ప్రజలకు అందు బాటులో ఉంటూ, ఫిర్యాదుదారుల సమ స్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.పోలీసు-ప్రజల మధ్య సఖ్యత పెంచి, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతా మన్నారు. ప్రజలు ఎలాంటి సమస్య ఉన్నా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని కోరారు.



అక్షర కలం
తెలుగు దినపత్రిక

# దాంపత్య కలహాలు... ప్రాణాలపై కాదు, పరిష్కారాలపై దృష్టి పెట్టండి

## -ఆవేశం ఒక క్షణం... నష్టం జీవితాంతం

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 30

ఇటీవల కాలంలో భార్యాభర్తల మధ్య తలెత్తుతున్న మనస్పర్థలు, కుటుంబ కలహాలు, ఆర్థిక సమస్యలు, అనుమానాలు వంటి కారణాలతో ఆత్మహత్యలు, హత్యలు పెరుగుతున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. క్షణిక ఆవేశంలో తీసుకునే నిర్ణయాలు కుటుంబాలను ఛిన్నాభిన్నం చేయడమే కాకుండా అమాయక పిల్లలను అనాథలుగా మారుస్తున్నాయి.

**-ప్రతి సమస్యకు చట్టబద్ధమైన పరిష్కారం ఉంది**

దాంపత్య జీవితంలో విభేదాలు రావడం అసాధారణం కాదు. అయితే వాటిని చర్చలు, కుటుంబ పెద్దల సలహాలు, కౌన్సెలింగ్ లేదా చట్టపరమైన మార్గాల ద్వారా పరిష్కరించుకోవచ్చు. కోపం లేదా నిరాశతో ప్రాణాలు తీసుకోవడం, ఎదుటివారి ప్రాణాలు తీయడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు.

**-పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించండి**

తల్లిదండ్రుల మధ్య జరిగే ఘర్షణలకు అత్యధికంగా నష్టపోయేది పిల్లలే. తల్లి లేదా తండ్రిని కోల్పోయిన పిల్లలు జీవితాంతం మానసిక వేదనను అనుభవించాల్సి వస్తుంది. కుటుంబ కలహాల భారాన్ని వారు మోయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.



**-హత్య, ఆత్మహత్య... రెండూ విషాదాంతాలే**

ఆవేశంలో జరిగే హత్యలు ఒక కుటుంబాన్ని శాశ్వతంగా నాశనం చేస్తే, ఆత్మహత్య మరో కుటుంబాన్ని దుఃఖంలో ముంచేస్తుంది. ఒక క్షణం ఆగి ఆలోచిస్తే అనేక ప్రాణాలు, అనేక కుటుంబాలు కాపాడబడతాయి. దసహాయం కోరడం బలహీనత కాదు మానసిక ఒత్తిడి, కుటుంబ సమస్యలు తీవ్రంగా అనిపించినప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు, న్యాయ నిపుణులు లేదా కుటుంబ కౌన్సెలర్లను సంప్రదించడం ఉత్తమ మార్గం. సమస్యను మనసులో దాచుకోవడం కంటే పంచుకోవడం మంచిది.




సమాజం కూడా బాధ్యత తీసుకోవాలి కుటుంబాల్లో ఏర్పడే విభేదాలను మరింత రెచ్చగొట్టకుండా, సఖ్యతతో పరిష్కరించే ప్రయత్నం చేయాలి. కుటుంబ పెద్దలు, సామాజిక సంస్థలు, ప్రజాప్రతినిధులు, కౌన్సెలర్లు ముందుకు వచ్చి బాధితులకు అండగా నిలవాల్సిన అవసరం ఉంది. ముగింపు దాంపత్య బంధం పరస్పర గౌరవం, నమ్మకం, సహనంతో నిలుస్తుంది. గొడవలు శాశ్వతం కావు. కానీ ప్రాణాలు అమూల్యం. భార్యాభర్తల గొడవలతో ప్రాణాలు తీసుకోవద్దు... ప్రాణాలు తీయవద్దు. మాట్లాడుకోండి... పరిష్కారం వెతకండి... జీవితాన్ని కాపాడుకోండి. ఫ్యామిలీ కౌన్సిలర్ సఖ్యత -వన్ స్టెప్ సెంటర్ అండ్ అడ్వకేట్ రాజలింగు మోతె 9676761221

# ఆఫీసర్స్ అలర్ట్ గా ఉండండి.....

## -అధికారులకు సెలవులు రద్దు, అత్యవసరమైతేనే సెలవులు పెట్టాలి...
## -అదిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలి....
## -అధికారులందరూ అందుబాటులో ఉండాలి....
## -కలెక్టరేట్లో 9391942254 కంట్రోల్ రూమ్ ఏర్పాటు.....
## -జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్.....

మెదక్, జూలై 30(అక్షర కలం):

అదిక వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, అధికారులందరూ అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులకు సూచించారు.గురువారం కలెక్టర్ క్యాంప్ ఆఫీస్ నుంచి గూగుల్ మీట్ సమావేశం జిల్లా అధికారులతో నిర్వహించారు.మండలాలవారిగా అదిక వర్షాలతో జరిగిన పరిస్థితులను స్థానిక తహసిల్దార్, ఎంపీడీవో , స్పెషల్ ఆఫీసర్లను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ అదిక వర్షాల వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ప్రజలందరూ అత్యవసరం ఉంటే తప్ప





బయటకు రావాలన్నారు. అధికారులందరూ అందు బాటులో ఉండాలని, అత్యవసరం ఉంటే తప్ప అధికారులు సెలవులు పెట్టొద్దన్నారు. కలెక్టరేట్లో 9391942254 కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి ఆస్తి నష్టం ప్రాణ నష్టం జరగకూడదనీ,అత్యవసర పరిస్థితులలో ప్రజలను రక్షించేందుకు రోప్స్, డ్రోన్స్ అందుబాటులో ఉంచుకోవాలన్నారు. అంటూ వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలనీ సూచించారు. చెరువులు, కల్వర్టులు, కుంటలలో నీరు ప్రవాహం రీచ్ అయ్యే అవకాశం ఉన్న దగ్గర సైన్ బోర్డులు పెట్టి చర్యలు తీసుకోవాలని,ప్రభుత్వ హాస్టల్స్ అంగన్వాడి సెంటర్స్, రూఫ్ లీకేజీ ఉన్నట్లయితే ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లలో ప్రజలకు నివాసం ఉండకుండా చర్యలు చేపట్టాలనీ అధికారులను ఆదేశించారు.దూప్ సింగ్ తండా వర్షాలు అధికమై వర్షపు నీరు ఉధృతంగా ప్రవహిస్తే ప్రజలకు రాకపోకలు ఇబ్బంది కలకుండా ప్రత్యామ్నాయ చర్యలపై దృష్టి సారించాలన్నారు.జిల్లా పంచాయతీ శాఖ ద్వారా సెక్రటరీలు ఎంపీవో లు సమన్వయంతో శానిటేషన్ పై ప్రత్యేక చర్యలు తీసుకుంటూ ,నీరు నిల్వ ఉండు ప్రదేశాలలో బ్లీచింగ్ పౌడర్ ఫాగింగ్ నిర్వహించాలన్నారు. వర్షాలు అధికంగా కురుస్తున్నందు వల్ల విద్యుత్ ప్రమాదాల జరిగే అవకాశం ఉన్నందున తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలన్నారు.మెడికల్ ఆఫీసర్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంటూ ప్రజారోగ్య పరిరక్షణ ధ్యేయంగా కృషి చేయాలన్నారు.అంటూ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాము కాటు, అంటువ్యాధుల , సీజనల్ వ్యాధుల మందులు అందుబాటులో ఉండాలని అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జెడ్పీ సి ఈ వో ఎల్లయ్యా, జిల్లా అధికారులు,ఆర్డీవోలు, ఎంపీడీవోలు, తాసిల్దారులు స్పెషలాఫీసర్లు, తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని రకాల ముందస్తు చర్యలు చేపట్టాలి

## -ప్రాణ,ఆస్తి నష్టం జరుగకుండా సహాయక చర్యలు చేపట్టాలి
## - జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, జూలై 30 (అక్షర కలం)

జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ ఆదేశించారు. గురువారం తహసీల్దార్లు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జూమ్ సమావేశం నిర్వహించి వర్షాల పరిస్థితి పై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా అధికారులు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగించాలని, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేగవంతంగా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గోదావరి పరీవాహక మండలాల్లో అధికారులు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని, గోదావరి నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ ముంపునకు గురయ్యే గ్రామాలు, కాలనీలను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అవసరమైతే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించే చర్యలు చేపట్టాలని తెలిపారు. తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ పరిధిలోని పునరావాస కేంద్రాలను తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, ఆహారం, వైద్య సదుపాయాలు తదితర అన్ని మౌలిక వసతులతో సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. ప్రజలను తరలించాల్సిన పరిస్థితి ఏర్పడితే వారికి భోజనం,



తాగునీరు, అవసరమైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్లు పట్టణ ప్రాంతాల్లో డ్రైనేజీలు, నాలాలు ఎక్కడా బ్లాక్ కాకుండా వెంటనే శుభ్రపరచాలని, వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని తెలిపారు. రోడ్లపై చెట్లు విరిగి పడితే వెంటనే తొలగించి రాకపోకలకు అంతరాయం లేకుండా చూడాలని, లోతట్టు ప్రాంతాల్లో నీటిముంపు సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, దెబ్బతిన్న విద్యుత్ లైన్లను పరిశీలించి ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పాత భవనాలు, శిథిలావస్థలో ఉన్న ఇళ్లను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు డ్రింకింగ్ వాటర్ బృందాలు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు, యంత్ర సామగ్రిని సిద్ధంగా ఉంచాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో 24 గంటలు పనిచేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొనారు. అధికారులు, సిబ్బంది తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండాలని, ముందస్తు అనుమతి లేకుండా ప్రధాన కార్యాలయాలను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు. ఎక్కడైనా వర్షాల కారణంగా ప్రమాదాలు, నీటి ముంపు, ఆస్తి నష్టం లేదా ప్రజల నుంచి ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరించాలని, తీసుకున్న చర్యలను జిల్లా కంట్రోల్ రూమ్‌కు వెంటనే తెలియజేయాలని ఆదేశించారు. ఈ సమావేశం లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి.రాజ గౌడ్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.ఎస్.లత, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాద ప్రాంతాలలో ప్రజల రాకపోకలను నియంత్రించాలి

## -జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య



అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 30:

ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదులు, కల్వర్టులు ఇతర ప్రమాద ప్రాంతాల వద్దకు ప్రజలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య తెలిపారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామపంచాయతీ పరిధిలోని వాగు ప్రవాహాన్ని, శిథిలావస్థలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ పి చంద్రయ్య మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితుల దృష్ట్యా ప్రజా సంక్షేమ, రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వాగు ఉధృతి పెరిగిన సందర్భంలో ప్రజలు ఎట్టి పరిస్థితులలోనూ వాగును దాటకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాగ్రత్త చర్యలలో భాగంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాగు వద్ద ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల భవనం ప్రస్తుత స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాల భవనం పరిస్థితిపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అత్యవసరం అయితేనే బయటకు రావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు, సిఐ నవీన్ కుమార్, ఎస్ఐ భూమేష్, పంచాయతీ కార్యదర్శి టి శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్‌లో భారీ ఉద్యోగ అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి....

## -జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్....




మెదక్, జూలై 30(అక్షర కలం):

మెదక్ జిల్లాలోని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ వివిధ విభాగాల్లో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. హోటల్, ఫుడ్, హాస్పిటాలిటీ, మార్కెటింగ్, ఫుడ్ టెక్నాలజీ, మెకానికల్, ఎలక్ట్రికల్, ఐటీ, హెచ్ఆర్, అకౌంట్స్ తదితర రంగాల్లో అనుభవం కలిగిన వారికి ఈ అవకాశాలు అందుబాటులో ఉన్నాయనీ,భర్తీ చేయనున్న పోస్టుల్లో ఆపరేషన్ మేనేజర్, ప్రొడక్షన్ మేనేజర్, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్, డిస్ట్రిబ్యూషన్ ఎగ్జిక్యూటివ్, మెయింటెనెన్స్ మేనేజర్, మెయింటెనెన్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ ఇన్‌చార్జ్, స్టోర్ ఎగ్జిక్యూటివ్, క్వాలిటీ ఇన్‌చార్జ్, క్వాలిటీ ఎగ్జిక్యూటివ్, క్వాలిటీ జూనియర్ ఎగ్జిక్యూటివ్, హెచ్ఆర్ ఎగ్జిక్యూటివ్, కుక్స్/షెఫ్స్, ఐటీ ఎగ్జిక్యూటివ్, ప్రొక్యూర్‌మెంట్/పర్చేజ్, అకౌంట్స్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అభ్యర్థులు సంబంధిత విద్యార్హతలు, అనుభవం కలిగి ఉండాలి. పోస్టును బట్టి 1 సంవత్సరం నుంచి 10 సంవత్సరాలకు పైగా అనుభవం అవసరం ఉంటుంది. వయోపరిమితి పోస్టును బట్టి 21 నుంచి 45 సంవత్సరాల మధ్య నిర్ణయించబడింది. ఎంపికైన అభ్యర్థులకు అర్హత, అనుభవాన్ని బట్టి రూ.18,000 నుంచి రూ.80,000 వరకు వేతనం అందజేయబడుతుంది. కుక్స్/షెఫ్స్ పోస్టులకు వేతనం అనుభవాన్ని బట్టి నిర్ణయిస్తారు. అన్ని పోస్టుల వర్క్ లొకేషన్ మెదక్ ఉంటుంది. ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలనుకునే యువత, అనుభవజ్ఞులు తమ అర్హతలకు అనుగుణంగా దరఖాస్తు చేసుకోవాలని హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటీస్ ఫౌండేషన్ ప్రతినిధులు కోరారు. అర్హత, అనుభవం కలిగిన అభ్యర్థులు వెంటనే దరఖాస్తు చేసుకొని ఈ వకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9372478535 సంప్రదించాలని, సోమవారం రోజున మెదక్ ప్రైవేట్ ఐ టి ఐ సబ్ (స్టేషన్ ఎదురుగా )లో 03-08-2026 రోజున జీశీఎ మేళా ఉంటుందని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సంపాదకీయం...

### పిడకల వేటకూ దొరకని జెన్--జీ




జంతర్ మంతర్ వద్ద ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన ఆందోళనను ఎలా చూడాలి.. అనే దానిమీద ఇంకా చర్చలు సాగుతూనే ఉన్నట్టున్నాయి. మార్పు మనం కోరుకున్న రీతిలో, మోతాదులో, కోరుకున్న పద్ధతిలో ఉంటే తప్ప చాలా మందికి తృప్తి కలగదు. అంగీకరించకపోయినా ఆ ధోరణిని దాని మూలాలను అర్థం చేసుకోవచ్చు. ఎంత గొప్ప రిలీఫ్ అనే ఫీలింగ్ వల్ల ఇప్పుడు ఏర్పడ్డ పాజిటివ్ వైబ్ పలుచనబడే సన్నివేశాలు మరిన్ని వస్తాయి. డాన్స్ వీడియోలతో కాస్త అటూ ఇటూగా అయిపోవచ్చు. రేపో మాపో మందు బాటిళ్ల విజువల్స్ కూడా ముందుకు రావచ్చు. ఆపైన ఎవరో ఇంకెవరితోనో, ఇంకేదో రకంగా ఉన్న విజువల్స్ వచ్చినా ఆశ్చర్యపోనక్కర్లేదు. దెబ్బతిన్న బలవంతుడు ఊరికే ఉండడు. పైగా చేతినిండా బలగం ఉన్నప్పుడు. ఆ శిబిరం సంగతి వదిలేయండి. 'ఆ డాన్సులు గట్రా ఏంటండీ, చేయకపోతే బాగుండేది' అనే దగ్గర సన్నాయి నొక్కులతో బయలుదేరతారే.. వారి గురించి మాట్లాడుకోవాల్సి ఉంది. ఎందుకంటే డాన్స్ దగ్గరే వీడియోలు ఆగవు కాబట్టి. ఇప్పుడు జైకొట్టినోళ్లే అప్పుడు కాస్త స్వరం మార్చి-- 'అప్పుడే అనుకున్నాం.. ఐడియాలజీ, నిర్మాణం లేకపోతే ఇలాగే...' అంటూ ఆ రూట్లో ముక్కులు చీదే అవకాశం ఉంటుంది కాబట్టి. ఐడియాలజీ, నిర్మాణం అసలు అవసరం లేదు అనట్లేదు కానీ, నిర్దిష్ట పరిస్థితుల్లో నిర్దిష్టమైన విశ్లేషణ అవసరం. మన బీకరులోనే అన్నీ ఇమడవు. మోదీ మీద కోపం వల్ల ఎవరో ఒకరు ఏదో రకంగా మెడలు వంచారనే సంబరం వల్ల ఆమోదం తప్పితే, ఇతరత్రా మనం కోరుకున్న శాస్త్రీయ పద్ధతుల్లో వారెవరూ లేరు అనే చింత, చింతన చాలా మందిలో ఉంటాయి. మనవల్ల కానిది పిల్లకాయలు చేశారు అనే ఉత్సాహాన్ని శాస్త్రీయ శర్మీయ ఆలోచనా పద్ధతుల త్రాసు అటూ ఇటూ చేస్తా ఉంటది. అక్కడ కాస్త మాట్లాడుకోవాల్సి ఉంది. ఇది పూర్తిగా మరో తరం. దాని కోపం, ప్రేమ, ద్వేషం, ఆనందం వేరే రూపాల్లో వ్యక్తం అవుతుంది. తొలి మూడు సెకన్లలో నువ్వు కండ్లలో కండ్లు పెట్టి నిలపలేకపోతే తప్పుకునిపోతుంది, తప్పించుకునిపోతుంది. ఈ బోరింగ్ బ్యాచ్‌తో నాకెందుకు అని. దిసీజ్ ఇన్స్టా జనరేషన్. కండెన్స్‌డ్, షార్ప్, ఆంబిషస్ అండ్ ఇండిపెండెంట్! ధిక్కారం అన్నివేళలా మనం కోరుకున్న పద్ధతుల్లోనే ఉండదు. అసలు మనం కోరుకున్న పద్ధతి అనేది ఎంత అప్డేటెడ్ అనేది వేరే చర్చ. అంతిమంగా ప్రజలకు కనెక్ట్ కావడం కదా దేనికైనా దారి. ఆ దారి మనకు తెలీకపోయిందని చరిత్ర చెబుతున్నది కదా, కాస్త తలవొగ్గి వినడం కూడా నేర్చుకోవాలె. ఈ నేల, దాని మీద కదలికలు మనకు కొన్నిసార్లు నేర్పుతాయి, నేర్చుకోవడానికి సిద్ధంగా ఉండాలె! ఇంతకీ వాళ్లేం సాధించారు? భయం అనే పొరను ఛేదించారు. నిరంకుశ పాలకుడితో తలపడుతున్నప్పుడు అదే కదా అతి పెద్ద అడ్డంకి, చైనా వాల్. అదిగో వీళ్లు తమ హ్యూమర్‌తో అట్లా ఈకలాగా తీసిపారేశారు. అది కదా విజయమంటే! ఒక దళితుడి నేతృత్వంలో వేలాది మధ్యతరగతి పిల్లలు కులమతాలకు అతీతంగా ఒక్కటై నినదించారు. ఆడారు, పాడారు. అంతకంటే గొప్ప దృశ్యం ఏం కావాలి. అంబేద్కర్‌కు కూడా సాధ్యపడని అపూర్వ దృశ్యం. ఆయన దళిత నాయకుడిగానే, ఇంకా చెప్పాలంటే మహర్ల నాయకుడిగానే తనువు చాలించాల్సి వచ్చింది. దీనర్థం.. అంబేద్కర్ కంటే ఈ కుర్రాడు అభిజిత్ దీప్కే గొప్ప నాయకుడనికాదు. అట్లా దురార్థం తీయకూడదు. ఈ సన్నివేశంలో అతను లేవనెత్తిన డిమాండ్, లేవనెత్తిన తీరు, సందర్భం అన్నీ కలిసి వచ్చాయి. ఎలా వచ్చినా ఒక దళితుడి నాయకత్వాన అంతమంది సవర్ణ విద్యార్థులు పోగవడం ఎప్పుడు చూస్తారండీ! అంతకంటే ఏం చూడాలి మనం! ఆ రెంటినీ మించింది తిరిగొచ్చిన విశ్వాసం. ఈ మట్టిలో ఇంకా బలముందని పంటలు పండలేనంతగా నాశనం కాలేదని, శ్రుతి--లయ సరిగ్గా కలవాలే కానీ ఇక్కడింకా రాగాలు పలకగలవని చూపించారు కదా! అదెంత గొప్ప ఊరట, అందరికీ! ఎండిపోయిందని దిగాలు పడిన చెట్టుకు మళ్లీ పూతపూయడం కాదూ! స్టడీ చేయాల, తెలుసుకోవాల. తెలియజెప్పడం అనేది మాత్రమే అలవాటైన వారు విద్యార్థులుగా మారితే తప్ప కొన్ని అర్థం కావు. దిసీజ్ నాన్ ఐడియలాజికల్, నాన్ స్ట్రక్చరల్, నాన్ 'సీరియెస్', నాన్ డిస్క్రిప్టివ్ మూవ్‌మెంట్ అండ్ మోమెంట్. అసలది స్టార్ట్ అవ్వడమే సెటైరికల్‌గా స్టార్ట్ అయ్యి, అంతే సెటైర్‌తో బలాన్ని ఎదుర్కొని నిలిచి గెలిచిన మూమెంట్. ఇందులో ఏ పిడకల వేటకూ ఆస్కారం దొరకదు. ఎట్లా పోట్లాడారో అట్లాగే సెలబ్రేట్ కూడా చేసుకుంటారు. అంతిమంగా అందరమూ ఆ డబ్బాలో సెనిక్కాయలు తెచ్చుకుని తింటున్న కుర్రాడి దగ్గరికి, పనిలో దుర్మార్గమైన యాతన ఎదుర్కొంటూ రోదిస్తూ, మనల్ని ఏడిపిస్తూ మాట్లాడుతున్న కార్మికుడి దగ్గరకు రావాల్సి ఉంటుంది. అది ఇంత త్వరగా స్టార్ట్ అయ్యేది కాదు, ముగిసేది కాదు. అది అంతిమ సత్యమే కానీ, ఈ జంతర్ మంతర్ చాటిన సత్యం చిన్నదేమీకాదు. అది చాలా వాటికి ఊపిరినిచ్చింది. దాన్ని చిన్నబుచ్చుక్కర్లేదు. అంతిమంగా ఉపాధ్యాయుల పాత్రలోంచి విద్యార్థుల పాత్రలోకి మారాల్సిన సన్నివేశం ఇది. కనెక్షన్ అనే సింగిల్ పాయింట్ స్టడీ ఇప్పటి అవసరం.

# గ్రామ ప్రజలందరికీ విజ్ఞప్తి....

**-గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలి....**

**-చిన్న ఘనపూర్ సర్పంచ్ మధుసూదన్ రెడ్డి.....**

కొల్చారం, జులై 30(అక్షర కలం):

మెదక్ జిల్లా కొల్చారం మండలంలోని గత మూడు నాలుగు రోజులు నుంచి కురుస్తున్న వర్షాల వల్ల మంజీరా పరివాహిక ప్రాంతం నిండు కుండలా ఉండడంతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సర్పంచ్ మధుసూదన్ రెడ్డి తెలిపారు.వాయుగుండం ఒక్కసారిగా వాతావరణం లో మార్పు రావడం వలన ఎడతెరిపి లేకుండా గత రెండు రోజులుగా వర్షాలు కురుస్తున్నందున ప్రజలు ఎవరు ఆందోళన పడకుండా అప్రమత్తంగా ఉండి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా వృద్ధులు వికలాంగులు బయటికి వెళ్లొద్దని కోరారు. చేపలు పట్టేవారు ఆవులు గేదెలను మేకలను కాచేవారు ఎట్టి పరిస్థితులలో మంజీర పరివాహిక ప్రాంతాలకు వెళ్ళొద్దని తెలిపారు. ఏమైనా సమస్యలు తమ ప్రాంతంలో ఉత్పన్నమైతే వార్డు సభ్యుల ద్వారా గ్రామపంచాయతీ అధికారులకు సర్పంచ్కు సమాచారం ఇచ్చి తగు సూచనలు సలహాలు తీసుకోవాలని సహాయ సహకారాలు అందుకోవాలని కోరారు. ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా గ్రామపంచాయతీ పాలకవర్గం ఎదుర్కోవటానికి సిద్ధంగా ఉందని సర్పంచ్ తెలియజేశారు. ఎవరు



కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు.

# పేదల ఇళ్లే.. ప్రజా పాలన మార్క్! : మంత్రి పొంగులేటి

**-అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు.. రాష్ట్రంలో గుడిసెలే ఉండకూడదనేదే మా సంకల్పం**

**-రూ.1.25 కోట్లతో చంద్రుగొండ మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి**

**-మహిళల సాధికారతకు రూ.70 వేల కోట్ల వడ్డీ లేని రుణాలు ఇచ్చి ప్రాధాన్యం ఇచ్చామని వెల్లడి**

అక్షర కలం/ ఖమ్మం బ్యూరో :

చంద్రుగొండ ?: ప్రజల ఇంటి గుమ్మం వద్దకే సంక్షేమ పథకాలను చేరవేసి, అర్హులైన ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవడమే తమ ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ మండలంలో రూ. 1. 25 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు గురువారం ఆయన శంకుస్థాపనలు చేశారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ అంకిత్‌లతో కలిసి మంగయ్యబంజార, పొకలగూడెం, రావికంపాడు గ్రామాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు.

**-పూరి గుడిసెలు లేని తెలంగాణగా తీర్చిదిద్దుతాం**

పొకలగూడెం వేదికగా జరిగిన సభలో మంత్రి



పొంగులేటి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఒక్క పేద కుటుంబం కూడా పూరి గుడిసెలో నివసించకూడదనే ధ్యేయంతో ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా రెండు విడతల్లో మొత్తం 7 లక్షల ఇందిరమ్మ గృహాల నిర్మాణాన్ని చేపట్టామని, ఒక్క రాజధాని హైదరాబాద్‌లోనే ప్రత్యేకంగా లక్ష ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. గత ప్రభుత్వం రూ. 8. 21 లక్షల కోట్ల అప్పుల భారం నెత్తిపై పెట్టినప్పటికీ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లలోనే ఏకంగా 72 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని, ఇటీవలే మరో 16 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసి నిరుద్యోగులకు భరోసా కల్పించామన్నారు. మహిళల ఆర్థిక సాధికారత కోసం రూ. 70 వేల కోట్ల వడ్డీలేని రుణాలను అందించామన్నారు. ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం, అర్హులకు కొత్త రేషన్ కార్డులతో పాటు నాణ్యమైన సన్నబియ్యాన్ని అందిస్తూ పేదల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని వివరించారు.



**-అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**

మండలంలోని మంగయ్యబంజార గ్రామంలో రూ. 45 లక్షలతో చేపట్టే గ్రావెల్ రోడ్డు, కల్వర్టు, సీసీ రోడ్డు, రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి కొత్తగా 24 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం పొకలగూడెంలో రూ. 60 లక్షల వ్యయంతో నాలుగు అంతర్గత సీసీ రోడ్ల పనులను ప్రారంభించి, ఈ గ్రామానికి ఇప్పటికే 77 ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని తెలిపారు. రావికంపాడులో రూ. 20 లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, మిగిలిన అంతర్గత రహదారులను కూడా త్వరితగతిన పూర్తి చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, చంద్రుగొండ తహసిల్దార్ జగదీశ్వర ప్రసాద్, డీపీఓ అనూష, గృహనిర్మాణ శాఖ పీడీతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నిర్ణిత షెడ్యూల్ ప్రకారం యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం పూర్తి చేయాలి జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

**-జిల్లాలో అత్యాధునిక సదుపాయాలతో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం**

**-రఘునాథపాలెం లోని స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నెలరోజుల లోపు అందుబాటులోకి రావాలి**

**-విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక విద్యకు అనుగుణంగా అన్ని వసతుల కల్పన**

**-ఖమ్మం నియోజకవర్గ కేంద్రంలో చేపట్టిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల, స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ బాలుర గురుకుల పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

అక్షర కలం/ ఖమ్మం ఉమ్మడి బ్యూరో:

రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న యంగ్ ఇండియా సమీకృత గురుకులాల పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం నాణ్యతతో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. ఖమ్మం నియోజకవర్గం పరిధిలోని రఘునాథపాలెం వైఎస్ఆర్ నగర్ ప్రధాన దారిలో రూ. 200 కోట్ల వ్యయంతో కొనసాగుతున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను గురువారం జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. స్కూల్ నిర్మాణంలో హాస్టల్స్ భవనాలు, అకాడమిక్ బ్లాక్‌లు, డార్మిటరీ భవనం, వంటగది, భోజనశాల, ప్రధాన నివాస గృహం, క్వార్టర్స్ నిర్మాణ ప్రాంతాలను కాలినడకన పరిశీలిస్తూ భవనాల పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని, ప్రతి పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నియోజక వర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో ఐదు యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. అందులో భాగంగానే ఖమ్మం నియోజక వర్గానికి సంబంధించిన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి అగ్రిమెంట్ ప్రకారం స్కూల్ నిర్మాణ పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. భవిష్యత్ తరాలకు నాణ్యమైన విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను ఏర్పాటు చేస్తోందన్నారు. విద్యార్థులు విద్యతో పాటు క్రీడలు, సాంకేతిక నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాసంలోనూ రాణించేలా అత్యాధునిక మౌళిక వసతులతో ఈ విద్యాసంస్థలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ఆవరణలో విద్యార్థుల రాకపోకలకు అనువుగా



లింక్ రోడ్లు, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్, పచ్చదనం వంటి మౌలిక వసతులను సమగ్రంగా అభివృద్ధి చేయాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ప్రణాళికాబద్ధంగా అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. నిర్మాణ సంస్థలు, ఇంజినీరింగ్ అధికారులు, సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతిరోజూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తూ, నాణ్యత ప్రమాణాలు తప్పకుండా పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పురోగతిపై ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రఘునాథపాలెం మండల కేంద్రంలో గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న స్కూల్ ఆఫ్ ఎక్స్ లెన్స్ (బాలుర) గురుకుల పాఠశాల/కళాశాల భవనం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. నెలరోజుల లోపు నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ తనిఖీలో కలెక్టర్ వెంట రఘునాథపాలెం తహసీల్దార్ శ్వేత, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## ఆట

# ఇంగ్లండ్ టెస్టు సారథిగా మళ్లీ జో రూట్.. హెడ్ కోచ్‌గా స్టీఫెన్ ఫ్లెమింగ్





రెండోసారి ఇంగ్లండ్ టెస్టు కెప్టెన్‌గా జో రూట్ నియామకం న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కొత్త హెడ్ కోచ్ బెన్ స్టోక్స్ రిటైర్మెంట్, మెకల్లమ్ తొలగింపు తర్వాత ఈ మార్పులు పాకిస్థాన్‌తో సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోథిక్ తాత్కాలిక కోచ్ పరిమిత ఓవర్ల కోచ్‌గా బ్రెండన్ మెకల్లమ్ కొనసాగింపు ఇంగ్లండ్ టెస్టు క్రికెట్‌లో అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. స్టార్ బ్యాటర్ జో రూట్ రెండోసారి టెస్టు జట్టు కెప్టెన్‌గా నియమితులయ్యాడు. అదే సమయంలో న్యూజిలాండ్ మాజీ కెప్టెన్, ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కోచ్‌లలో ఒకరైన స్టీఫెన్ ఫ్లెమింగ్‌ను టెస్టు జట్టు హెడ్ కోచ్‌గా ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఎంపిక చేసింది. ఈ మేరకు నేడు అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఇటీవల మాజీ కెప్టెన్ బెన్ స్టోక్స్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించడం, టెస్టు హెడ్ కోచ్ పదవి నుంచి బ్రెండన్ మెకల్లమ్‌ను తొలగించడంతో ఈ కీలక నియామకాలు జరిగాయి. గతంలో 2017 నుంచి 2022 వరకు రూట్ 64 టెస్టుల్లో ఇంగ్లండ్‌కు సారథ్యం వహించాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లోనూ తాత్కాలిక కెప్టెన్‌గా జట్టును నడిపించాడు. టెస్టు క్రికెట్‌లో 14,000 పరుగులకు పైగా సాధించి, సచిన్ టెండూల్కర్ తర్వాత అత్యధిక పరుగుల జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. ఈ సందర్భంగా రూట్ మాట్లాడుతూ.. "మళ్లీ ఇంగ్లండ్ టెస్టు జట్టుకు కెప్టెన్‌గా ఎంపికవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇది కష్టమైన బాధ్యత అయినా, ఎంతో సంతృప్తినిస్తుంది. తర్వాతి తరం ఆటగాళ్లను ముందుకు నడిపించడానికి ఉత్సాహంగా ఉన్నాను" అని తెలిపాడు. ఫ్లెమింగ్‌ను ఆటపై అపారమైన పరిజ్ఞానం ఉన్న అద్భుతమైన నాయకుడిగా అభివర్ణించాడు. మరోవైపు చెన్నై సూపర్ కింగ్స్‌కు ఐదు ఐపీఎల్ టైటిళ్లు అందించిన స్టీఫెన్ ఫ్లెమింగ్ నియామకాన్ని ఈసీబీ మేనేజింగ్ డైరెక్టర్ రాబ్ కీ సమర్థించాడు. ఫ్లెమింగ్ ప్రపంచ క్రికెట్‌లో అత్యంత గౌరవనీయమైన కోచ్‌లలో ఒకరని, జట్టులోని ప్రతిభను ప్రపంచ స్థాయి ప్రదర్శనగా మార్చగలరని విశ్వాసం వ్యక్తం చేశాడు. ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. "ప్రస్తుత విజయాలతో పాటు జట్టుకు మధ్యకాలిక, దీర్ఘకాలిక భవిష్యత్తును అందించడమే లక్ష్యం. కెప్టెన్ జో రూట్‌తో కలిసి పనిచేయడానికి ఎదురుచూస్తున్నాను. అతను తరానికి ఒక్కడొచ్చే ప్రతిభావంతుడు" అని పేర్కొన్నాడు. ఆగస్టు 19 నుంచి పాకిస్థాన్‌తో ప్రారంభం కానున్న మూడు మ్యాచ్‌ల సిరీస్‌కు మార్కస్ ట్రెస్కోథిక్ తాత్కాలిక హెడ్ కోచ్‌గా వ్యవహరిస్తాడు. ఆ తర్వాత ఫ్లెమింగ్ బాధ్యతలు స్వీకరిస్తాడు. బ్రెండన్ మెకల్లమ్ ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల జట్లకు కోచ్‌గా కొనసాగుతాడు.

## రహానె రిటైర్మెంట్.. ఓటమి ఎరుగని కెప్టెన్‌కు బీసీసీఐ సలాం




అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్లకు వీడ్కోలు పలికిన అజింక్యా రహానె భారత క్రికెట్‌కు చేసిన సేవలకు ధన్యవాదాలు తెలుపుతూ బీసీసీఐ పోస్ట్ టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా అరుదైన రికార్డు సాధించిన రహానె ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ అందించిన ఘనత టెస్టులు, వన్డేలు, టీ20లలో మెరుగైన గణాంకాలతో కెరీర్‌కు ముగింపు భారత సీనియర్ బ్యాటర్, టెస్టుల్లో జట్టుకు చారిత్రక విజయాలు అందించిన అజింక్య రహానె అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు నేడు ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక భావోద్వేగ వీడియో ద్వారా ప్రకటించాడు. దీంతో దాదాపు రెండు దశాబ్దాల పాటు సాగిన ఆయన కెరీర్‌కు తెరపడింది. రహానె రిటైర్మెంట్ ప్రకటనపై బీసీసీఐ వెంటనే స్పందించి, ఆయన సేవలను కొనియాడింది. "ఒక అద్భుతమైన కెరీర్ ముగిసింది. భారత క్రికెట్‌కు మీరు అందించిన అపారమైన సేవలకు, చిరకాలం గుర్తుండిపోయే జ్ఞాపకాలకు ధన్యవాదాలు. మీ తదుపరి ప్రయాణానికి మా శుభాకాంక్షలు" అని బీసీసీఐ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేసింది. కెప్టెన్‌గా చెరగని ముద్ర బ్యాటర్‌గానే కాకుండా కెప్టెన్‌గా కూడా రహానె తనదైన ముద్ర వేశాడు. టెస్టుల్లో ఓటమి ఎరుగని కెప్టెన్‌గా ఆయనకు అరుదైన రికార్డు ఉంది. కనీసం ఐదు మ్యాచ్‌లకు నాయకత్వం వహించిన భారత కెప్టెన్లలో అత్యధిక విజయశాతం రహానెదే కావడం విశేషం. అతని సారథ్యంలో భారత్ నాలుగు టెస్టుల్లో గెలిచి, రెండింటిని డ్రా చేసుకుంది. ఆస్ట్రేలియా గడ్డపై 2020-21లో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టును చారిత్రక విజేతగా నిలపడం అతని కెప్టెన్సీ కెరీర్‌లో మరుపురాని ఘట్టం. విరాట్ కోహ్లీ గైర్హాజరీలో జట్టును ముందుండి నడిపించిన రహానె, మెల్‌బోర్న్‌లో అద్భుత విజయాన్ని అందించాడు. ముఖ్యంగా గబ్బాలో ఆస్ట్రేలియాకు ఏళ్ల తరబడి ఉన్న ఓటమి ఎరుగని రికార్డుకు బ్రేక్ వేసి సిరీస్‌ను 2-1 తేడాతో భారత్ కైవసం చేసుకోవడంలో కీలక పాత్ర పోషించాడు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## సినిమా
CINEMA

# 100 కోట్ల క్లబ్‌లో అఖిల్.. 'లెనిన్'తో కెరీర్ బిగ్గెస్ట్ హిట్!




100 కోట్ల క్లబ్‌లో చేరిన అఖిల్ అక్కినేని 'లెనిన్' కెరీర్‌లోనే అతిపెద్ద హిట్‌గా నిలిచిన చిత్రం విడుదలైన 4 రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించిన సినిమా సోషల్ మీడియా ద్వారా ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపిన అఖిల్ అక్కినేని యువ హీరో అఖిల్ తన కెరీర్‌లోనే అతిపెద్ద విజయాన్ని అందుకున్నారు. ఆయన నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తోంది. రెండో వారాంతంలోనే ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.100 కోట్ల గ్రాస్ వసూళ్లను దాటి, అఖిల్ కెరీర్‌లో తొలి 100 కోట్ల చిత్రంగా రికార్డు సృష్టించింది. ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న ఈ భారీ విజయంతో అఖిల్ ఆనందంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా అఖిల్ సోషల్ మీడియా వేదికగా ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. రూ.100 కోట్ల రికార్డు పోస్టర్‌ను పంచుకుంటూ, "నమ్మిన, మద్దతిచ్చిన, ఆదరించిన ప్రతి ఒక్కరికీ.. ఈ విజయం మీకోసం. ఎంతో కృతజ్ఞతతో తదుపరి సినిమాకు సిద్ధమవుతున్నాను. త్వరలోనే థియేటర్లలో కలుద్దాం" అని తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. మురళీ కిషోర్ అబ్బూరు దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటించారు. విడుదలైన మొదటి రోజు నుంచే 'లెనిన్' పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్లింది. 'లెనిన్' చిత్రం ఆర్థికంగా కూడా భారీ విజయాన్ని నమోదు చేసింది. సుమారు రూ.55 కోట్ల బడ్జెట్‌తో నాగార్జున అక్కినేని, నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. అఖిల్ స్టార్‌డమ్‌ను బట్టి థియేట్రికల్ బిజినెస్ రూ.22 కోట్లుగా జరగగా, బ్రేక్ ఈవెన్ టార్గెట్ రూ.44 కోట్లుగా ఉంది. అయితే, అంచనాలను మించిపోయిన ఈ చిత్రం కేవలం 3-4 రోజుల్లోనే అన్ని మార్కెట్లలో బ్రేక్ ఈవెన్ సాధించి లాభాల బాట పట్టింది. ఈ అద్భుతమైన విజయం అఖిల్ కెరీర్‌కు ఎంతో అవసరమైన భారీ బూస్ట్‌ను ఇచ్చిందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## బాలీవుడ్ నటికి సైబర్ షాక్... రూ. 2.43 లక్షలు కాజేసిన మోసగాళ్లు



సైబర్ మోసానికి గురైన నటి కీర్తి కుల్హారి ఆమె క్రెడిట్ కార్డు నుంచి రూ. 2.43 లక్షలు అపహరణ గుర్తుతెలియని వ్యక్తులపై ముంబైలో కేసు నమోదు క్షణాల వ్యవధిలో నాలుగు అనధికారిక లావాదేవీలు కేసు దర్యాప్తు చేస్తున్న ముంబై సైబర్ సెల్ పోలీసులు ప్రముఖ బాలీవుడ్ నటి, నిర్మాత కీర్తి కుల్హారి సైబర్ మోసానికి గురయ్యారు. గుర్తుతెలియని వ్యక్తులు ఆమె క్రెడిట్ కార్డు నుంచి అనధికారికంగా రూ. 2,43,852 మేర లావాదేవీలు జరపడంతో ఆమె ముంబై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై అంబోలి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు కాగా, నగర సైబర్ సెల్ అధికారులు దర్యాప్తు చేపట్టారు. వివరాల్లోకి వెళ్తే, జూలై 24 రాత్రి ఈ సైబర్ మోసం చోటుచేసుకుంది. అంధేరి వెస్ట్‌లోని ఓ మల్టీప్లెక్స్ వద్ద ఉన్న సమయంలో కీర్తి మొబైల్ ఫోన్‌కు బ్యాంకు నుంచి ఒక సందేశం వచ్చింది. ఆమె క్రెడిట్ కార్డును ఉపయోగించి ఏరోమెక్సికో ఎయిర్‌లైన్స్‌లో 2,525 యూఎస్ డాలర్ల విలువైన లావాదేవీ జరిగినట్లు అందులో ఉంది. దీంతో అప్రమత్తమైన ఆమె వెంటనే బ్యాంకు కస్టమర్ కేర్‌ను సంప్రదించారు. బ్యాంకు అధికారులు ఆమె ఖాతాను పరిశీలించగా, నిమిషాల వ్యవధిలోనే మొత్తం నాలుగు అనధికారిక లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు. వాటి మొత్తం విలువ రూ. 2.43 లక్షలకు పైగా ఉండటంతో, తదుపరి నష్టం జరగకుండా బ్యాంకు తక్షణమే ఆ కార్డును బ్లాక్ చేసింది. తాను తన క్రెడిట్ కార్డు పాస్‌వర్డ్, పిన్ లేదా ఇతర రహస్య వివరాలను ఎవరితోనూ పంచుకోలేదని కీర్తి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో స్పష్టం చేశారు. మాల్వేర్ లేదా స్పైవేర్ ద్వారా ఆమె ఫోన్ లేదా కార్డు వివరాలను సైబర్ నేరగాళ్లు తస్కరించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు. 'పింక్', 'యూరి: ది సర్జికల్ స్ట్రైక్', 'మిషన్ మంగళ్' వంటి చిత్రాలతో పాటు 'ఫోర్ మోర్ షాట్స్ ప్లీజ్!', 'స్కూప్' వంటి వెబ్ సిరీస్‌లతో కీర్తి కుల్హారి ప్రేక్షకులకు సుపరిచితులు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# గ్రామ స్వరూపం మారాలి.. పాలన పారదర్శకంగా సాగాలి.!

- నల్గొండ జిల్లా నూతన పంచాయతీ అధికారి వనం తరుణ చక్రవర్తి
- జెపి మార్గన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వీడి.. పల్లెల ప్రగతి కోసం గ్రూప్-1 బాట
- 100 % పన్నుల వసూలు, నగదు లావాదేవీల రద్దు ద్వారా నిధుల దుర్వినియోగానికి చెక్
- పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీరు, వీధిలైట్ల నిర్వహణే నా మొదటి ప్రాధాన్యత
- విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు.. 'అక్షర కలం' ప్రత్యేక ఇంటర్వ్యూలో నూతన డీపీవో వనం తరుణ్ చక్రవర్తి



ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

మల్టీ నేషనల్ కంపెనీలో జెపి మార్గన్ వంటి రూ.లక్షల జీతం ఇచ్చే సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, గ్రౌండ్ లెవెల్‌లో ప్రజలకు నేరుగా సేవ చేయాలనే దృఢ సంకల్పంతో గ్రూప్–1 సాధించి, నేడు జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు చేపట్టిన వనం తరుణ్ చక్రవర్తి తో 'అక్షరకలం' ప్రత్యేక ముఖాముఖి.

**ప్రశ్న: సర్, ముందుగా మీ నేపథ్యం, విద్యాభ్యాసం గురించి వివరాలు తెలియజేయండి?**

**డిపిఓ:** నా పేరు వనం తరుణ్ చక్రవర్తి. మాది యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఎస్.లింగోటం గ్రామం. ఎన్ఐటి వరంగల్ నుంచి బీటెక్ కంప్యూటర్ సైన్స్ పూర్తి చేశాను.

**ప్రశ్న: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నుంచి గ్రూప్-1 వైపు రావడానికి ప్రేరణ ఏమిటి? మీ ప్రయాణం ఎలా సాగింది?**

**డిపిఓ:** మొదట నేను జెపి మార్గన్ (JP Morgan) గ్రూప్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేశాను. అయితే గ్రామస్థాయిలో, గ్రౌండ్ లెవెల్‌లో ప్రజలకు నేరుగా సేవ చేయాలనే ఉద్దేశంతోనే సివిల్స్, గ్రూప్స్ వైపు ఆలోచన వచ్చింది. ఉద్యోగాన్ని వదిలి ప్రిపేర్ అయ్యాను. మొదటి ప్రయత్నంలోనే రాష్ట్రస్థాయిలో 148వ ర్యాంకు సాధించాను. 2025 సెప్టెంబర్‌లో వనపర్తి జిల్లా డిపిఓగా బాధ్యతలు చేపట్టి, ప్రస్తుతం నల్లగొండ జిల్లా పంచాయతీ అధికారిగా బాధ్యతలు స్వీకరించాను.

**ప్రశ్న: మన జిల్లా పంచాయతీ వ్యవస్థలో మీరు గుర్తించిన ప్రధాన సమస్యలు ఏమిటి?**

**డిపిఓ:** నల్లగొండ జిల్లా పరిధిలోని దేవరకొండ, మిర్యాలగూడ, నల్లగొండ డివిజన్లలో పరిశీలిస్తే.. ముఖ్యంగా దేవరకొండ డివిజన్‌లో పంచాయతీ కార్యదర్శుల కొరత ఉంది. ఈ విషయాన్ని వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ఖాళీల భర్తీ ద్వారా సమస్యను పరిష్కరిస్తాం.

**ప్రశ్న: బాధ్యతలు స్వీకరించాక మీ మొదటి ప్రాధాన్యత దేనిపై ఉంటుంది?**

**డిపిఓ:** గ్రామాలలో పారిశుద్ధ్యం, సురక్షిత తాగునీరు, వీధిలైట్ల సక్రమ నిర్వహణపై మొదటి ప్రాధాన్యత ఉంటుంది. పారిశుద్ధ్యంలో భాగంగా తడి, పొడి చెత్తతో పాటు మిగిలిన వ్యర్థాలను నాలుగు రకాలుగా వేరు చేసి పంచాయతీ సిబ్బందికి ఇచ్చేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తాం.

**ప్రశ్న: పంచాయతీలలో పన్నుల వసూలు పారదర్శకంగా జరగడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**

**డిపిఓ:** ప్రతీ ఆర్థిక సంవత్సరంలో 100% పన్నుల (House Tax, trade licence ) వసూలే లక్ష్యంగా పనిచేస్తాం. డిఎల్‌పిఓలు, ఎంపీఓల నిరంతర పర్యవేక్షణ ద్వారా పన్నుల వసూళ్లలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పూర్తి పారదర్శకత పాటిస్తాం.

**ప్రశ్న: పంచాయతీ నిధుల దుర్వినియోగాన్ని అరికట్టేందుకు మీ ప్రణాళిక ఏంటి?**

**డిపిఓ:** నిధుల దుర్వినియోగం కాకుండా చూడటంలో ఎంపీవో ల పాత్ర అత్యంత కీలకమైనది. ప్రతీ రూపాయి ఖర్చును ఆన్‌లైన్ విధానం (PFMS / ePanchayat) ద్వారా మాత్రమే చెల్లిస్తాం. నగదు (Cash) రూపంలో జరిపే లావాదేవీలను పూర్తిగా నిషేధించాలి.

**ప్రశ్న: గ్రామ కార్యదర్శులు, ఇతర సిబ్బంది బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తే ఎలాంటి చర్యలు ఉంటాయి?**

**డిపిఓ:** విధుల్లో అలసత్వం, పారదర్శకత లోపిస్తే సహించేది లేదు. కార్యదర్శులు నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన కఠిన చర్యలు తప్పవు.

**ప్రశ్న : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలు/నిధులు ప్రతీ గ్రామానికి చేరేలా ఎలా పర్యవేక్షిస్తారు?**

**డిపిఓ:** డిజిటల్ ట్రాకింగ్ సిస్టమ్, ప్రత్యక్ష తనిఖీల ద్వారా నిధుల కేటాయింపులు, వినియోగాన్ని పర్యవేక్షిస్తాం. పంచాయతీల వారీగా సోషల్ ఆడిట్ (సామాజిక తనిఖీ) సమర్థవంతంగా నిర్వహిస్తాం.

**ప్రశ్న : పంచాయతీలకు సొంత ఆదాయ వనరులు (Own Revenue) పెంచుకోవడానికి మీ సూచనలేమిటి?**

**డిపిఓ:** వాణిజ్య సముదాయాల నిర్వహణ, ఆస్తి పన్నుల సక్రమ వసూలు, ప్లాంటేషన్ ప్రాజెక్టులు, స్థానిక వనరుల వినియోగం ద్వారా గ్రామ పంచాయతీలకు స్వయం సమృద్ధి చేకూరేలా సర్పంచ్‌లకు, కార్యదర్శులకు అవగాహన కల్పిస్తాం.

**ప్రశ్న : గ్రామాలను 'మోడల్ గ్రామాలు' గా తీర్చిదిద్దడానికి మీ కార్యాచరణ ఏమిటి?**

**డిపిఓ:** ప్రణాళికాబద్ధమైన పారిశుద్ధ్యం, వంద శాతం డిజిటలైజేషన్, ఇంకుడు గుంతల నిర్మాణం, హరితహారం ద్వారా పచ్చదనం పెంపొందించడం, స్థానిక ప్రజల భాగస్వామ్యంతో ప్రతి గ్రామాన్ని మోడల్ గ్రామంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం.

**-ప్రజల నుండి మీరు ఆశిస్తున్న సహకారం ఏమిటి.?**

"ప్రజా సమస్యల పరిష్కారానికి జిల్లా పంచాయతీ కార్యాలయం తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయి. ప్రజలు తమ ఫిర్యాదులు, సూచనలను నేరుగా లేదా అధికారిక పోర్టల్స్ ద్వారా అందజేయవచ్చు. గ్రామాల ప్రగతిలో ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యం. సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, పంచాయతీ కార్యదర్శులు రాజకీయాలకు అతీతంగా ఊరి అభివృద్ధి కోసం ఒక బృందంగా పనిచేయాలి. సమర్థవంతమైన పాలన అందించి, నల్లగొండ జిల్లా పంచాయతీ వ్యవస్థను రాష్ట్రంలోనే ఆదర్శంగా నిలబెడదాం."

## ఆర్టీఐ అమల్లో అలసత్వం.. అధికారికి రూ.10 వేల జరిమానా

అక్షరకలం దేవరకొండ



డా,, కొర్ర. కిషన్ నాయక్
RTIAS రాష్ట్ర అధ్యక్షులు
ఫోన్ నెం 9885122005

సమాచార హక్కు చట్టం–2005 అమలులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రజా సమాచార అధికారి (పీఐఓ)పై తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చట్టం నిర్దేశించిన గడువులోగా దరఖాస్తుదారునికి సమాచారం అందించకపోవడంతో సంబంధిత అధికారికి రూ. 10,000 జరిమానా విధిస్తూ రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీమతి మొహ్సిన్ పర్వీన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.దనాగర్ కర్నూల్ జిల్లా వంగూరు మండలం పోల్కంపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతిగృహానికి సంబంధించిన వివరాలు కోరుతూ సమాచార హక్కు చట్టం ద్వారా దరఖాస్తు దాఖలైంది. అయితే చట్టబద్ధమైన 30 రోజుల వ్యవధి దాటినా పీఐఓ సమాచారం ఇవ్వలేదు. అనంతరం జిల్లా సాంఘిక సంక్షేమ అధికారికి తొలి అప్పీల్ చేసినా ఫలితం లేకపోవడంతో, బాధితులు రాష్ట్ర సమాచార కమిషన్‌లో ద్వితీయ అప్పీల్ (అప్పీల్ నెం. 10382/SIC-MP/2026) నమోదు చేశారు. హైదరాబాద్ ఎం.జే. మార్కెట్ సమీపంలోని సమాచార హక్కు భవన్‌లో ఈ పిటిషన్‌పై విచారణ జరిగింది. పిటిషనర్ తరఫున రైట్ టు ఇన్ఫర్మేషన్ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డా. కొర్ర కిషన్ నాయక్ హాజరై వాదనలు వినిపించారు. విచారణ సందర్భంగా పీఐఓ వైఖరిపై కమిషనర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రజలకు సకాలంలో సమాధానం ఇవ్వడం అధికారుల ప్రాథమిక బాధ్యతని, నిర్లక్ష్యం వహించడం చట్ట ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. అధికారి ప్రదర్శించిన అలసత్వానికి గానూ రూ.10,000 జరిమానా విధిస్తూ, ఆ మొత్తాన్ని వారం రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు. అలాగే దరఖాస్తుదారుడు కోరిన పూర్తి సమాచారాన్ని ఎలాంటి మినహాయింపులు లేకుండా వెంటనే అందించాలని స్పష్టం చేశారు. కమిషన్ తీసుకున్న ఈ నిర్ణయం ప్రభుత్వ శాఖల్లో జవాబుదారీతనాన్ని పెంచుతుందని ఆర్ టి ఐ ఆక్టివిస్ట్లు హర్షం వ్యక్తం చేశారు

## మాదారం గ్రామంలో హరిత శోభ

### -ఘనంగా వన మహోత్సవ కార్యక్రమం

అక్షరకలం బిబినగర్



పర్యావరణ పరిరక్షణ, గ్రామాన్ని హరితమయంగా మార్చడమే లక్ష్యంగా యాదాద్రి భువనగిరి జిల్లా, బీబీనగర్ మండలం మాదారం గ్రామంలో వన మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ శ్రీ మందడి వెంకట్ రెడ్డి మరియు ఉప సర్పంచ్ శ్రీ పంజాల శ్రీరాములు గౌడ్లు మొక్కలు నాటి అధికారికంగా ప్రారంభించారు. ?ఈ సందర్భంగా సర్పంచ్ మందడి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ... భావితరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను గ్రామస్థులు తీసుకోవాలని కోరారు. అనంతరం ఉప సర్పంచ్ పంజాల శ్రీరాములు గౌడ్ మాట్లాడుతూ, పచ్చదనంతోనే మానవాళి మనుగడ సాధ్యమవుతుందని, గ్రామ అభివృద్ధిలో పర్యావరణ పరిరక్షణ కూడా ఒక భాగమని పేర్కొన్నారు. ?ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పోలేపాక గణేష్, రవి, ఫీల్డ్ అసిస్టెంట్ చేగురి రామస్వామితో పాటు గ్రామ పంచాయతీ సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఫీజుల బకాయిలపై బిజెవైఎం లడాయి

### -సంతకాల సేకరణ

అక్షరకలం నాంపల్లి




రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ. 15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ "ఫీజుల బకాయి – బిజెపి లడాయి" పేరిట నాంపల్లి మండల కేంద్రంలో బీజేవైఎం ఆధ్వర్యంలో విద్యార్థుల సంతకాల సేకరణ నిర్వహించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు నాంపల్లి సతీష్ ఆధ్వర్యంలో ప్రభుత్వ, మోడల్, కస్తూరిబా జూనియర్ కళాశాలల్లో ఈ కార్యక్రమం జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి సతీష్ కుమార్ మాట్లా డుతూ... ప్రభుత్వం ఫీజులు చెల్లించకపోవడంతో విద్యార్థులకు సర్టిఫికెట్లు రాక ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. పేద విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటే ఊరుకునేది లేదని, వెంటనే బకాయిలు విడుదల చేయకపోతే ఎమ్మెల్యేలు, మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పబ్బు వంశీ, శివ గౌడ్, మేకల శ్రీకాంత్, చింతల శంకర్, నాంపల్లి శంకర్, జక్కుల శివ, ఇతర కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

## దేవరకొండలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించాలి

### -ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్

అక్షరకలం దేవరకొండ





దేవరకొండ నియోజకవర్గంలో అర్హుడైన ఏ ఒక్క ఓటరు కూడా తమ ఓటు హక్కుకు దూరం కాకూడదన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రధాన లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ స్పష్టం చేశారు. గురువారం దేవరకొండలోని తన నివాసంలో ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, నల్లగొండ పార్లమెంట్ ూ×= కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరై, బూత్‌ల వారీగా వివరాలను సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలు నాయక్ మాట్లాడుతూ... నియోజకవర్గంలోని మొత్తం 326 బూత్‌ల పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం అభినందనీయమన్నారు. ఈ ప్రక్రియలో చురుగ్గా పాల్గొన్న బూత్ లెవల్ ఏజెంట్లు , అధికారులు , పార్టీ మండల అధ్యక్షులు, కో–ఆర్డినేటర్లకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే మహత్తర బాధ్యతను పార్టీ శ్రేణులు నిబద్ధతతో నెరవేర్చాయని కొనియాడారు. సాంకేతిక కారణాలు లేదా ఇతర కారణాల వల్ల ఎవరైనా అర్హులు ఓటరు జాబితాలో నమోదు కాకపోతే, వారిని తక్షణమే గుర్తించి ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. నల్లగొండ డిసిసి అధ్యక్షుడు పున్న కైలాష్ నేత, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లా డుతూ... దేవరకొండ నియోజకవర్గంలో ఎమ్మెల్యే బాలు నాయక్ నాయకత్వంలో ఎస్ఐఆర్ ప్రక్రియ అత్యంత వేగంగా, ఆదర్శవంతంగా సాగిందని ప్రశంసించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవరెడ్డి, పార్లమెంట్ కో–ఆర్డినేటర్ ఎం.ఎ. సిరాజ్ ఖాన్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ముక్కమల్ల వెంకటయ్య గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ దూదిపాల వేణుధర్ రెడ్డితో పాటు నియోజకవర్గ ఎస్ఐఆర్ ఇన్‌ఛార్జులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్షరకలం తెలుగు దినపత్రిక
నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి

# వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటలే శ్రేయస్కరం

**-జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్**
**-ఎల్ నినో ప్రభావంతో 40% తగ్గిన వర్షపాతం**
**-తక్కువ నీటితో, ఎక్కువ ఆదాయం ఇచ్చే ఆరుతడి పంటల వైపే మళ్లాలని పిలుపు**

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం




ఎల్ నినో కారణంగా జిల్లాలో 40 శాతం తక్కువ వర్షపాతం నమోదైన దృష్ట్యా రైతులు ఈ వ్యవసాయ సీజన్ లో కంది, పెసర, సజ్జలు, జొన్నలు వంటి ఆరుతడి పంటలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆరుతడి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని, దీంతో రైతులకు మేలు కలుగుతుందని,మంచి ఆదాయం వస్తోందని చెప్పారు. అందువల్ల జిల్లాలోని రైతులందరూ ఈ వ్యవసాయ సీజన్లో అరుతడి పంటలు, కూరగాయల పంటల సాగుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు. గురువారం ఆయన నిడమనూరు మండలం, బంకాపురం గ్రామంలో కంది పంట సాగు చేసిన రైతుల వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు. ఈ సందర్భంగా కంది పంట సాగు వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో కంది సాగు చేశారని ? పంట వయస్సు ఎంత అని? నల్లరేగడి భూమిలో పంట పరిస్థితి ఎలా ఉందని? ప్రశ్నించారు. దీనికి రైతులు సమాధానమిస్తూ రెండు నెలల క్రితం 15 ఎకరాల్లో కంది సాగు చేశామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాపుతు ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలో సాధారణంవర్షపాతం కంటే 40 శాతం తక్కువగా నమోదైందని, ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజ్ మాత్రమే ఉన్నందున నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు తప్పనిసరిగా ఆరుతడి పంటల వైపు మళ్లాలని విజ్ఞప్తి చేశారు. ఆరుతడి పంటలు 90 రోజుల వ్యవధిలో చేతికి వస్తాయని, తక్కువ నీటితో మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు.ఒకవేళ భవిష్యత్తులో నీటి లభ్యత మెరుగుపడితే పరిస్థితులకు అనుగుణంగా ఇతర పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం వివిధ రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ఇస్తున్నది, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంది, పెసర వంటి పంటలను ఎక్కువగా సాగు చేస్తే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని అన్నారు. అలాగే పండ్ల తోటలు, కూరగాయల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు.పంటల్లో కలుపు మొక్కలు పెరిగిన వెంటనే శాస్త్రీయ పద్ధతుల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయ అధికారులు అవసరైతే రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి కలుపు నివారణ, పంటల నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. రైతులతో మాట్లాడిన సందర్భంగా యాప్ వినియోగంపై ఎలాంటి ఇబ్బందులు లేవని రైతులు కలెక్టర్‌కు తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఆరుతడి పంటలు సాగు చేస్తామని చెప్పారు.ఆరుతడి పంటలకు సంబంధించి జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజూ సమీక్షించి నివేదిక సమర్పించాలని, రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ల్లా ఉద్యాన శాఖ అధికారి టి .శేఖర్,ఏ డి ఏ సరిత, ఏఈఓ మున్నికృష్ణ, తహసిల్దార్ కృష్ణయ్య, ఏఈలు నిషిత, క్రాంతి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకటి సత్యం, సర్పంచ్ చిన్న వెంకటేశం, వ్యవసాయ అధికారులు, రైతులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# నల్గొండ రైతుల భాగ్యరేఖ

**-రూపుదిద్దుకుంటున్న పతంజలి పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ**
**-యాచారంలో పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ పనులు వేగవంతం**
**-అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశం**

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం

నల్గొండ జిల్లా రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉండనున్న పతంజలి పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ నిర్మాణ పనులను వచ్చే సంక్రాంతి నాటికి పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ నల్గొండ జిల్లా, అనుముల మండలం, యాచారం గ్రామంలో 39 ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణంలో ఉన్న పతంజలి పామ్ ఆయిల్ ప్రాసెసింగ్ కంపెనీ పనులను పరిశీలించారు. నిర్మాణ యంత్రాల ఏర్పాటు, మౌలిక సదుపాయాలు, విద్యుత్ కనెక్షన్, ప్రాసెసింగ్ విభాగాలు, పార్కింగ్, ప్రధాన ప్రవేశ ద్వారం తదితర అంశాలను పరిశీలిస్తూ అధికారులను, కంపెనీ ప్రతినిధులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్ పామ్ సాగుకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదని, రైతులు పండించే ఆయిల్ పామ్ పంటకు మార్కెట్ సమస్య లేకుండా ఈ ప్రాసెసింగ్ యూనిట్ కీలకంగా ఉపయోగపడుతుందని కలెక్టర్ అన్నారు. అందువల్ల రైతులకు ఈ పరిశ్రమ వల్ల కలిగే ప్రయోజనాలపై



విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పంట కోసిన వెంటనే సమీపంలోనే ప్రాసెసింగ్ సౌకర్యం అందుబాటులో ఉండడం వల్ల రైతులకు రవాణా వ్యయం తగ్గడమే కాకుండా, పంట నాణ్యతను కాపాడుతూ మంచి ధర లభించే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా లభిస్తాయని చెప్పారు. నిర్మాణ పనులు వేగవంతం చేసి, నిర్ణయించిన గడువులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.నిర్మాణానికి అవసరమైన మెటీరియల్ మొత్తం వచ్చిందా ?, ప్రస్తుతం ఏయే పనులు కొనసాగుతున్నాయి? ప్రాసెసింగ్ యూనిట్, పార్కింగ్ స్థలం, ప్రధాన ప్రవేశ మార్గం, ఇతర మౌలిక వసతుల పనులు ఏ దశలో ఉన్నాయనే విషయాలను కంపెనీ ప్రతినిధులను అడిగి తెలుసుకున్నారు. పతంజలి యాజమాన్య ప్రతినిధులు స్పందిస్తూ మిల్లుకు అవసరమైన యంత్రాలలో సుమారు 90 శాతం ఇప్పటికే సైట్‌కు చేరుకున్నాయని, సివిల్ నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. అలాగే హైటెన్షన్ (HT) విద్యుత్ కనెక్షన్ ఏర్పాటుకు సంబంధించిన పనులు కూడా జరుగుతున్నాయని, మిగిలిన యంత్రాల ఏర్పాటు, అంతర్గత అభివృద్ధి పనులు పూర్తి చేసి వచ్చే సంక్రాంతి నాటికి పరిశ్రమను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్‌కు వివరించారు. నిర్మాణ పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, రైతులకు త్వరితగతిన సేవలు అందించే విధంగా అన్ని పనులను ప్రణాళికాబద్ధంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. రైతులకు ఆయిల్ పామ్ సాగు ప్రయోజనాలు, పంట కొనుగోలు విధానం, ప్రాసెసింగ్ యూనిట్ ద్వారా లభించే సౌకర్యాలపై వ్యవసాయ శాఖ అధికారులు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. జిల్లా హార్టికల్చర్ అధికారి టి. శేఖర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వినోద్ కుమార్, శాస్త్రవేత్త రాములమ్మ,పతంజలి ప్రతినిధులు సంగని కుమార్,బి యాదగిరి , బొబ్బిలి వినాయక, అధికారులు కలెక్టర్ వెంట ఉన్నారు.

# చేనేత మహాసభ ప్రచార కరపత్రాల ఆవిష్కరణ

**-చేనేత సొసైటీలకే నేరుగా ప్రభుత్వ దుస్తుల ఆర్డర్లు ఇవ్వాలని డిమాండ్**

అక్షర కలం : చిట్యాల

ఆగస్టు 4న హైదరాబాద్, ఆటోనగర్‌లోని కర్నాటి గార్డెన్స్‌లో తెలంగాణ చేనేత సహకార సంఘాల అధ్యక్షులు, పాలకవర్గ సభ్యుల రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ తెలిపారు. ఈ సదస్సును సంబంధించిన ప్రచార కరపత్రాలను చిట్యాలలో గురువారం ఆయన ఆవిష్కరించారు. ?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత సొసైటీల బలోపేతానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల మాదిరిగానే చేనేత సహకార సంఘాల క్యాష్ క్రెడిట్ రుణాలను ప్రభుత్వం పూర్తిగా మాఫీ చేయాలిఅని. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఈ ప్రకటన చేయాలని కోరారు. టెండర్లలో ప్రైవేట్ వ్యక్తులకు ప్రాధాన్యం ఇవ్వకుండా, గురుకులాలు, ప్రభుత్వ హాస్టళ్లకు




కావలసిన దుస్తుల ఆర్డర్లను నేరుగా చేనేత సొసైటీలకే అప్పగించాలి అని అన్నారం ఏకగ్రీవంగా ఎన్నికైన సొసైటీలకు ప్రత్యేక గ్రాంటు ప్రకటించడంతో పాటు, నిలిచిపోయిన త్రిఫ్ట్ ఫండ్ డబ్బులను బ్యాంకుల ద్వారా వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ?ఈ సదస్సుకు మాజీ ఐఏఎస్ అధికారి వెంకటేశం ముఖ్యఅతిథిగా హాజరై సహకార సంఘాల చట్టాలు, నిర్వహణపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కందగట్ల గణేష్, చిట్యాల చేనేత సొసైటీ అధ్యక్షుడు గంజి సుధాకర్, ప్రధాన కార్యదర్శి చెరుపల్లి శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు మిర్యాల వెంకటేశ్వర్లు, కోశాధికారి కోట రాంబాబు, డైరెక్టర్ వద్దేపల్లి రాములు తదితరులు పాల్గొన్నారు...

## ప్రీ -ప్రైమరీలో నియామకాలు వెంటనే చేపట్టాలి

**-టీఎస్ యుటిఎఫ్ డిమాండ్**

అక్షరకలం నల్గొండ

ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన ప్రీ-ప్రైమరీ తరగతులకు వెంటనే ఉపాధ్యాయులను (ఇన్‌స్ట్రక్టర్లు), ఆయాలను నియమించాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నల్లగొండ జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు బక్క శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి పెరుమాళ్ల వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. నల్లగొండ జిల్లాలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను ప్రభుత్వం 124 ప్రాథమిక పాఠశాలల్లో ప్రీ-ప్రైమరీ తరగతులను ఏర్పాటు చేసి, జూన్ 15 నుండి విద్యార్థుల ప్రవేశాల ప్రక్రియను ప్రారంభించిందని తెలిపారు. అయితే, ఈ పాఠశాలల్లో ఇన్‌స్ట్రక్టర్లు మరియు ఆయాల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చి నెలలు గడుస్తున్నా.. నేటికీ భర్తీ చేయకపోవడం శోచనీయమన్నారు.

**-పడిపోతున్న హాజరు...**

సకాలంలో ఉపాధ్యాయులను నియమించకపోవడం వల్ల బోధన సరిగ్గా సాగక, ఉపాధ్యాయులు లేక పిల్లల విద్య దెబ్బతింటోందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. దీంతో చాలామంది తమ పిల్లలను తిరిగి ప్రైవేట్ పాఠశాలల్లో చేరుస్తున్నారని తెలిపారు.

?ప్రీ ప్రైమేరీ తరగతుల నిర్వహణ బాధ్యతలను కూడా ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకే అప్పగించడంతో 1 నుండి 5 తరగతుల నిర్వహణ తీవ్రంగా ప్రభావితమవుతోందన్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా లక్ష్యాల సాధనకు అడ్డంకిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు.

**-తక్షణమే చర్యలు తీసుకోవాలి..**

?ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రీ-ప్రైమరీ విద్యా విధానం దెబ్బతినకుండా ఉండాలంటే 124 పాఠశాలల్లో నియామక ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన ప్రీ -ప్రైమరీ విద్య అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రకటనలో డిమాండ్ చేశారు.

## ఆపదలో ఉన్న ఆర్యవైశ్య కుటుంబాలకు బాసట

**-చెరువుగట్టు అగ్నిప్రమాద బాధితులకు 2 లక్షల ఆర్థిక సాయం**

అక్షరకలం బీబీనగర్



చెరువుగట్టు శ్రీ పార్వతీ జడల రామలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఇటీవల సంభవించిన ప్రమాదంలో ఇళ్లు, దుకాణాలు పూర్తిగా దగ్ధమై తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఇద్దరు ఆర్యవైశ్య కుటుంబాలకు తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ అండగా నిలిచింది. బాధిత కుటుంబాలకు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ తరపున రూ. 2,00,000 ఆర్థిక సాయాన్ని మంజూరు చేశారు. ఈ ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షులు శ్రీ అమరవాది లక్ష్మీనారాయణ గారు శనివారం బాధితులకు స్వయంగా అందజేశారు. రూ.1,00,000 చొప్పున ఆర్థిక సాయం ప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన ఆర్యవైశ్య కుటుంబాలైన శ్రీ రంగా శ్రవణ్ కుమార్ రూ. 1,00,000 కర్నాటి ఎల్లయ్య కు రూ. 1,00,000 చొప్పున మొత్తం రూ. 2,00,000 చెక్కులను నేతలతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడుతూ... ఆపదలో ఉన్న స్వజాతీయ సోదరులను ఆదుకోవడంలో ఆర్యవైశ్య మహాసభ ఎల్లప్పుడూ ముందుంటుందని, బాధితులు ధైర్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కొండే మల్లికార్జున్ (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి) రేణిగుంట గణేష్ గుప్తా (రాష్ట్ర కోశాధికారి) ఇరుకుల్ల రామకృష్ణ గారు (ఆర్గనైజింగ్ సెక్రటరీ) చింతల రవి కుమార్ గారు (కోఆర్డినేటర్) మరియు తదితర సంఘ నాయకులు పాల్గొన్నారు.

## చిట్యాలలో కాలుష్య పరిశ్రమలపై బీఆర్ఎస్ ఆందోళన

**-దుర్వాసన వెదజల్లుతున్న పరిశ్రమలపై తక్షణ చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం**

అక్షర కలం : చిట్యాల



నల్గొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పరిధిలోని పరిశ్రమల నుంచి వెలువడుతున్న విషపూరితమైన పొగ, దుర్వాసనతో పట్టణ ప్రజల ఆరోగ్యం తీవ్ర ముప్పులో పడిందని బీఆర్ఎస్ పార్టీ నాయకులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఎంపీఎల్ కంపెనీతో పాటు సమీపంలోని ఇతర పరిశ్రమల నుంచి వస్తున్న కాలుష్యం కారణంగా ప్రజలు శ్వాసకోశ సమస్యలు, కళ్ల మంటలు, తలనొప్పి వంటి అనేక అనారోగ్య సమస్యలతో అల్లాడిపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ?ఈ సమస్య పై గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నాయకులు చిట్యాల మున్సిపల్ కమిషనర్ గురులింగం కు ఒక వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా టిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని, కాలుష్య నియంత్రణ మండలి అధికారులతో కలిసి పరిశ్రమలను వెంటనే పరిశ్రమల్లో కాలుష్య నియంత్రణ పరికరాలు సక్రమంగా పనిచేస్తున్నాయో తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో అధికంగా దుర్వాసన, విషపూరిత వాయువులను వదులుతున్న పరిశ్రమలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న పరిశ్రమ యాజమాన్యాలపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ?ప్రజల ఆరోగ్యం కంటే పరిశ్రమల లాభాలు ముఖ్యం కావు అని, కాలుష్య సమస్యను అధికారులు నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తులో ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం అని హెచ్చరించారు. పట్టణ ప్రజలకు స్వచ్ఛమైన గాలి, పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉందని గుర్తు చేశారు. ?ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ళ లింగస్వామి, జమాండ్ల శ్రీనివాస్ రెడ్డి, స్థానిక కౌన్సిలర్లు నిమ్మనగోటి శ్రీనివాస్ (10వ వార్డు), ఎస్కే షబానా అజీముద్దీన్ (2వ వార్డ్)లతో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు బొబ్బల శివశంకర్ రెడ్డి, ఆగు అశోక్ మరియు టిఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు..

అక్షరకలం
తెలుగు దినపత్రిక

## గ్రామ అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకం.

### -సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు.

అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి



గ్రామ అభివృద్ధిలో మహిళ పాత్ర అత్యంత కీలకమని మహిళలే గ్రామానికి వెన్నుముఖ అని విజయలక్ష్మి నగర్ సర్పంచ్ చందవత్ రమేష్ బాబు అన్నారు.

-ఇల్లందు మండలం పట్టణ కేంద్రం శివారు ప్రాంతమైన

విజయలక్ష్మి నగర్ గ్రామపంచాయతీలో సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు అధ్యక్షతన మహిళా గ్రామ సభను నిర్వహించారు. ఈ యొక్క మహిళా గ్రామసభలో మహిళలు అత్యధికంగా పాల్గొని గ్రామంలో ఉన్న పలు సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ చందావత్ రమేష్ బాబు మాట్లాడుతూ వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు, ప్రభుత్వం అందిస్తున్న రుణాలను అదే విధంగా చూడాలని 55 సంవత్సరాలు దాటిన మహిళలను కూడా గ్రూపుగా ఏర్పాటు చేసి పొదుపులు కట్టించాలని 14 సంవత్సరాల దాటిన పిల్లలను కూడా స్నేహ గ్రూపులుగా ఏర్పాటు చేయాలని వివో లకు ఆయన సూచించారు. త్వరలోనే అధికారులతో మాట్లాడి వివో బిల్డింగ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సెక్రటరీ సందీప్ ఉపసర్పంచ్ గూడెల్లి రేణుక వార్డు సభ్యులు మల్లికా, కళావతి, వసంత,హరిసింగ్, సదా, వివోలు,ఏఎన్ఎంలు ఆశ కార్యకర్తలు,అంగన్వాడీ టీచర్లు,గ్రామ పంచాయితీ మహిళా లు తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐ గద్దెను కూల్చడం పిరికిపందల చర్య

### -ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధం

### -సిపిఐ నగర కార్యదర్శి జానిమియా

అక్షర కలం/ ఖమ్మం రూరల్:



ఖమ్మం అర్బన్ : సిపిఐ పార్టీ గద్దెను కూల్చడం పిరికిపందల చర్య అని ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య -స్ఫూర్తికి విరుద్ధమని సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్ కె జానిమియా తెలిపారు. ఖమ్మం నగరంలోని ఎనిమిదవ డివిజన్ వైఎస్ఆర్ నగర్ కాలనీలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఏర్పాటు చేసిన పార్టీ గద్దెను బుధవారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. విషయం తెలిసిన వెంటనే సిపిఐ ఖమ్మం నగర కార్యదర్శి ఎస్కె జానిమియా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, ఏఐటీయుసి ఆటో స్టాండ్ ఉపాధ్యక్షులు షేక్ అక్రమ్, ఖానాపురం హవేలీ సహాయ కార్యదర్శి ఆముదాల వెంకన్న తదితరులు ఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని పరిశీలించారు. స్థానికులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం నగర కార్యదర్శి జానిమియా మాట్లాడుతూ ప్రజాస్వామ్య విలువలను తీవ్రంగా దెబ్బతీసేవిధంగా సిపిఐ పార్టీ గద్దెను అర్ధరాత్రి వేళ -అక్రమంగా కూల్చివేయడం అత్యంత ఖండనీయ మన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్య స్ఫూర్తికిద విరుద్ధమన్నారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని, పోలీస్ అధికారులను కోరారు. ప్రజల్లో ఉద్రిక్తతలు సృష్టించే చర్యలకు ఎవరు పాల్పడవద్దని శాంతియుత వాతావరణాన్ని కాపాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కూల్చివేసిన చోటే సిపిఐ పార్టీ గద్దెను తిరిగి ఏర్పాటు చేయాలని జానిమియా డిమాండ్ చేశారు.

## మానవ అక్రమ రవాణా, గృహ హింసపై అవగాహన శిబిరం :

అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, (జులై,30)



నారాయణపేట టౌన్‌లోని బృందావన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్ కళాశాలలో నారాయణపేట జిల్లా న్యాయ సేవా సంస్థ (డిఎల్ఎస్ఎ) మరియు జిల్లా సీనియర్ సివిల్ జడ్జి విన్య నాయక్ ఆదేశాల మేరకు అంతర్జాతీయ మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కే. అవినాష్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కే. అవినాష్ మాట్లాడుతూ, జూలై 30 తేదీని ఐక్యరాజ్య సంఘం మానవ అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవంగా ప్రకటించిందని, మానవ అక్రమ రవాణా స్వేచ్ఛకు, గౌరవాలకు విరుద్ధమైన నేరం అంటూ దీన్ని గుర్తించాలని చెప్పారు. ఆయన చెప్పారు --- "ట్రాఫికింగ్ అంటే మనుషులను కొనడం అమ్మడం. ముఖ్యంగా పిల్లలు, మహిళలు లక్ష్యంగా ఉంటారు. ఉద్యోగాలు, పెళ్ళి, చదువు వంటి మెరుపు వాగ్దానాలతో బాధితులను ఉల్లికిస్తారు." అదనంగా, మానవ అక్రమ రవాణా బాధితులపై అవగాహన పెంచడం, ట్రాఫికర్లను గుర్తించి అరికట్టడం ఈ ప్రచారం లక్ష్యం కావడం చెప్పి, ఉద్యోగ, విద్య పేర్లు పెట్టి వచ్చే మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ట్రాఫికింగ్‌ను గుర్తించి, నివారించి, బాధితులకు సరైన సహాయం అందించాల్సినతీత చెప్పారు. గృహ హింసపై కూడా అవగాహన పెంచారు. కే. అవినాష్ వివరించారు: "గృహ హింస అంటే కేవలం కొట్టడమే కాదు. మానసిక వేధింపు, ఆర్థిక వేధింపు, లైంగిక వేధింపులను కూడా ఇందులోనే పరిగణిస్తాం. గృహహింస చేసినవారు భర్త మాత్రమే కాదు; కుటుంబ సభ్యులు కూడా బాధ్యులు అయి ఉండొచ్చు." గ్రామీణ, నగర సమాజాల్లో మహిళల భద్రత, గౌరవం ముఖ్యమని, సమాజం బలంగా ఉండాలంటే మహిళలు సురక్షితంగా ఉండాల్సిన అవసరాన్ని ఆయన పునరావృతం చేశారు. అనుమానాస్పద చర్యలు -గమనిస్తే సంప్రదించాల్సిన హెల్ప్‌లైన్ నంబర్లు: 1098 --- చైల్డ్ హెల్ప్‌లైన్ (24x7) 181 --- మహిళా హెల్ప్‌లైన్ 5100 --- ఎన్ ఎ ఎల్ ఎస్ ఎ ఉచిత న్యాయ సహాయం 112 --- అత్యవసర సేవల టోల్-ఫ్రీ నంబర్ కార్యం ప్రోగ్రాంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మిపతి గౌడ్, సఖిసెంట్రి సిబ్బంది, చిల్డ్రన్స్ డిపార్ట్మెంట్ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులు అరెస్టులు నిర్బంధాలతో బిఆర్ఎస్ సైనికులను నిలువరించలేరు

### -రాష్ట్ర బి ఆర్ ఎస్ పార్టీ సోషల్ మీడియా వారియర్ పావని గౌడ్.

అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:-

అక్రమ కేసులు అరెస్టులు నిర్బంధాలతో బి.ఆర్.ఎస్ సైనికులను నిలువ రించలేరని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు సోషల్ మీడియా వారియర్ పావని గౌడ్ అన్నారు. బి ఆర్ ఎస్ రాష్ట్ర మహిళా నాయకురాలు అండ్ సోషల్ మీడియా వారియర్ పావని గౌడ్ పై 9 కేసులు నమోదు కాగా అందులో ఇల్లందు నియోజక వర్గం నుండి నమోదైన కేసులో భాగంగా గురువారం ఇల్లందు కోర్టుకు ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా పావని గౌడ్ ను బి ఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక సభ్యులు, ఖమ్మం ఉమ్మడి జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, భద్రాద్రి కొత్తగూడెంజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్, ఆయనతోపాటు తెలంగాణ ఉద్యమ నాయకులు సిలువేరి సత్యనారాయణ, టీబీజీకేఎస్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ సుదర్శనం రంగనాథ్, బిఆర్ఎస్ పట్టణ పార్టీ మాజీ అధ్యక్షులు మొహమ్మద్ జబ్బార్, మాజీ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ నబీ, మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ భావ్ సింగ్ నాయక్,ఇల్లందు మండల మాజీ అధ్యక్షులు దేరింగ్ల పోషం, యువ యువజన విభాగం నాయకులు సోషల్ మీడియా వారియర్ గిన్నారపు రాజేష్, సోషల్ మీడియా వారియర్ కాసాని హరిప్రసాద్, సనా రాజేష్, మాజీకోఆప్షన్ సభ్యులు ఘాజి, రాచపల్లి శ్రీను, మూలగండ్ల ఉపేంద్రరావ్, సనా రాజేష్, శ్రీకాంత్ సునీల్, లలిత్ పాసి, ఈలపల్లి ముత్తయ్య,గోల్డ్ ఇమ్రాన్,ఫైనాన్స్ ఇమ్రాన్, బిఎస్సార్ రామ్ లాల్ పాసి, కిషన్ పాసి,కరాటే రమేష్, తుంగపల్లి మహేష్, గడ్డి శ్రీను,నిఖిల్, రాంబాబు, మహిళా నాయకురాలు నెమలి ధనలక్ష్మి,సరితా, పింకీ, సులక్షణ లు తదితరులు ఆమెను కలిసిన వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకురాలు రాష్ట్ర సోషల్ మీడియా వారియర్ పావని గౌడ్ మాట్లాడుతూ 9 కేసులు కాదు 99 అక్రమ కేసులు బనాయించిన గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి పరిపాలనను ప్రశ్నిస్తూనే ఉంటామని, రాష్ట్రంలో 420 దొంగ హామీలు, ఆరు మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల పక్షాన అనుక్షణం పోరాడుతూ,అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ ప్రభుత్వం వంచించడాన్ని నిరసిస్తూ, తెలంగాణ రాష్ట్ర రైతులకు తెలంగాణ తొలి ముఖ్యమంత్రివర్యులు కెసిఆర్ సాగునీరు అందిస్తే, అధికారంలోకి వచ్చిన



గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం రైతన్నలకు సాగునీటిని అందించకుండా, డ్యాములలో నీటిని విడుదల చేయకుండా రైతులను గోస పెడుతున్న ఇబ్బందిని గుర్తించి రైతుల పక్షాన పోరాడుతూవున్న తాము రేవంత్ రెడ్డిని గుంపు మేస్త్రి అని ఉచ్చరించినందుకు రాష్ట్రవ్యాప్తంగా తనపై తొమ్మిది కేసులు నమోదు అయ్యాయని తెలిపారు. ప్రజల పక్షాన అనుక్షణం కొట్లాడుతూ ఉంటానని మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి అరాచకాలను సోషల్ మీడియా వేదికగా అనుక్షణం ప్రశ్నిస్తూనే ఉంటామని,భారత రాష్ట్ర సమితి సోషల్ మీడియా అక్రమ అరాచక కేసులకు వెనుకకు తగ్గేది ఉండదని తొమ్మిది కేసులు కాకపోతే 99 కేసులు పెట్టుకున్న సరే మోసపూరిత గుంపు మేస్త్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఊపిరి ఉన్నన్ని రోజులు ప్రశ్నిస్తూనే ఉంటామని ఆమె తెలిపారు.

## నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శంగా నిలవాలి





### -యాంకీ లో కంటైనర్ అంగన్ వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్.

అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి,( జులై 30)

నర్వ మండలం జాతీయ స్థాయిలో ఆదర్శ మండలంగా నిలవాలని, ఇక్కడ చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందేలా మన అందరం కలిసి పనిచేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక పిలుపునిచ్చారు. గురువారం నారాయణ పేట జిల్లా నర్వ మండలం(యాస్పరేషన్ బ్లాక్) లోని యాంకీ గ్రామంలో నూతన కంటైనర్ అంగన్ వాడీ కేంద్రాన్ని గ్రామ సర్పంచి కల్యాణి తో కలిసి ఆమె ప్రారంభించారు. కేంద్రంలో సరస్వతి మాత చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రంలో ఎంత మంది చిన్నారులు ఉన్నారని?.అందులో శ్యామ్ మ్యామ్ చిన్నారులు ఎంత మంది ఉన్నారని అంగన్ వాడీ టీచర్ ను అడిగి తెలుసుకున్నారు. అంగన్ వాడీ కేంద్ర ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గ్రామంలోని ప్రతి చిన్నారి తప్పనిసరిగా విద్యను అభ్యసించాలనీ, ఒక్క విద్యార్థి కూడా చదువు మానేయకుండా చూడడం మనందరి బాధ్యత అని తెలిపారు. చాలా సంవత్సరాలుగా ప్రారంభించాలని భావించిన ఈ అంగన్‌వాడీ కేంద్రం ఈరోజు ప్రారంభం కావడం ఎంతో ఆనందంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ కేంద్రాన్ని ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా, పరిశుభ్రంగా ఉపయోగించుకోవాలన్నారు. ఇది సాధారణ భవనం కాకుండా కంటైనర్ మోడల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రం అని, అందరూ బాధ్యతతో సంరక్షించాలని ఆమె తెలిపారు. గ్రామంలోని మరో ప్రాంతంలో కూడా అంగన్‌వాడీ కేంద్రం అవసరం ఉంటే, తప్పకుండా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. నర్వ మండలానికి ఏబీపీ కింద ప్రభుత్వం ప్రత్యేకంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తోందని, మండలానికి చెందిన సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు ఈ మండలంలో ఇంకా ఏయే వినూత్న కార్యక్రమాలు చేపట్టవచ్చో, ఇప్పటికే ఉన్న భవనాలను ఎలా మరింత మెరుగుపరచవచ్చో ఆలోచించి ప్రతిపాదనలు తీసుకురావాలని ఆమె సూచించారు. గ్రామాల అవసరాలను యాస్పరేషన్ బ్లాక్ సమన్వయ కర్త దృష్టికి తీసుకు వస్తే అందుబాటులో ఉన్న నిధుల నుంచి వాటికి ఆమోదం ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. నర్వ మండలంలోని సర్పంచ్‌లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం నర్వ మండలంలో యాస్పరేషన్ బ్లాక్ కింద అనేక భవనాల నిర్మాణాలకు ఆమోదాలు ఇవ్వడం జరిగిందని, ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మరుగుదొడ్ల నిర్మాణాలకు కూడా అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు. పనులను త్వరగా పూర్తి చేస్తే, బిల్లులు కూడా వెంటనే చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలో చేపట్టిన అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీడీఓ, అధికారులు, సర్పంచ్‌లకు ఆమె సూచించారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులలో పత్తి, వరి వంటి సంప్రదాయ పంటలకు బదులుగా కందులు, పెసర్లు వంటి స్వల్పకాలిక ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని ఈ సందర్భంగా ఆమె రైతులకు సూచించారు. దీనివల్ల వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైతులు మెరుగైన ఫలితాలు పొందే అవకాశం ఉంటుందని ఆమె తెలిపారు. అంతకు ముందు డీ డబ్ల్యు ఓ/ డిపివో, డీఆర్డీవో, తహసిల్దార్, ఎంపిడివో, సిడిపివో లను కలెక్టర్ శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీ డబ్ల్యు ఓ రాజేందర్ గౌడ్, డీఆర్డీవో/ డిపివో వెంకట్ రాములు, తహసిల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీవో శ్రీనివాస్, సిడిపివో, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిరసన దినంగా పాటించండి

### -తుడుం దెబ్బ ,ఏఈడబ్ల్యూసీఏ ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా భారీ నిరసన కార్యక్రమాలు...

### -ఆదివాసీల రాజ్యాంగ హక్కుల పరిరక్షణ కోసం ప్రతి ఆదివాసీ ఉద్యమంలో భాగస్వామి కావాలి, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి,వర్ష శ్రీనివాస్ ...

అక్షర కలం/పినపాక.

ఆదివాసి హక్కుల పోరాట సమితీ తుడుం దెబ్బ, ఏఈడబ్ల్యూసీఏ, ఆధార్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని "నిరసన దినంగా" రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని పిలుపునిస్తు న్నామని ఆదివాసి హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ రాష్ట్ర కార్యదర్శి వర్ష శ్రీనివాస్ తెలిపారు. భారత రాజ్యాంగంలోని 244వ అధికరణ ప్రకారం అమలులో ఉన్న ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం, పేసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం,2006 వంటి చట్టాలు ఆదివాసీల రక్షణ కోసం ఉన్నప్పటికీ, వాటి అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఆదివాసీల భూములు,అటవీ హక్కులు,స్వయం పాలన, జీవనాధారాలు తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలు సాగు చేస్తున్న సుమారు 8 లక్షల ఎకరాల భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలని, పోడు భూము లకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని, 1/70 చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, 2023లో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న 1/70 చట్టానికి సంబంధించిన కేసుల్లో ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాపాడేలా వెంటనే పక్షకర్తగా జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. జీవో నెం.3 స్థానంలో చట్టబద్ధమైన కొత్త జీవోను తీసుకురావాలని, ఆదివాసులపై అటవీ శాఖ నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని, ఐటీడీఏలో గతంలో ఉన్న 29 ప్రభుత్వ శాఖలను పునరుద్ధ రించాలని,ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం, పేసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం--2006లను పగడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఆగస్టు 9న రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో తుడుం దెబ్బ, ఏఈడ బ్ల్యూసీఏ, ఆధార్ సొసైటీ ఆధ్వ ర్యంలో భారీ నిరసన ర్యాలీలు నిర్వహిస్తామని, నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలు,నల్ల టోపీలు,నల్ల టీషర్టులు ధరించి నిరసన తెలుపుతామని తెలిపారు.అనంతరం డాక్టర్ బి.ఆర్.



అంబేద్కర్, కొమరం భీమ్ విగ్రహాలకు నివాళు లర్పించి సంబంధిత అధికా రులకు వినతిపత్రాలు సమర్పిస్తా మని చెప్పారు.ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాల నాయకులు,సామాజి క కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్స వాన్ని నిరసన దినంగా విజయ వంతం చేయాలని రాష్ట్ర కార్యదర్శి వర్ష శ్రీనివాస్ పిలుపుని చ్చారు. రాజ్యాంగబద్ధమైన ఆదివాసీ హక్కులను కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమమే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# ఇరిగేషన్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల అంశంలో

-సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడం రాష్ట్ర రైతాంగానికి శుభపరిణామం

-ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అక్షర కలం/ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి:

తెలంగాణ రాష్ట్రంలోని ఇరిగేషన్ ప్రాజెక్టులకు పర్యావరణ అనుమతుల అంశంలో సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వడం రాష్ట్ర రైతాంగానికి శుభపరిణామమని, ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్మాణంలో ఉన్న సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు ఇక పూర్తి స్థాయిలో మార్గం సుగమమైందని పినపాక ఎమ్మెల్యే, తెలంగాణ శాసనసభ షెడ్యూల్ ట్రైబ్స్ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు గురువారం హర్షం వ్యక్తం చేశారు.పర్యావరణ అనుమతుల సాధన కోసం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిరంతరం చేసిన కృషి, కేంద్ర ప్రభుత్వంతో జరిపిన సమన్వయం, న్యాయపరమైన చర్యలు ఈ విజయానికి ప్రధాన కారణమయ్యాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన సహకారం కూడా అభినందనీయమని అన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టు పూర్తయితే 36.37 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యం ఏర్పడి, సుమారు 6.74 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు 282.80 మెగావాట్ల జలవిద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉందని ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రాజెక్టు ద్వారా పినపాక నియోజకవర్గంతో పాటు ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులకు శాశ్వత సాగునీటి భద్రత కలగడంతో పాటు వ్యవసాయ ఉత్పాదకత గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో పెండింగ్‌లో ఉన్న ఇరిగేషన్ ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్టుకు లభించిన ఈ అనుకూల తీర్పు రాష్ట్ర నీటిపారుదల రంగంలో మరో కీలక మైలురాయిగా నిలుస్తుందని, రైతుల అభ్యున్నతికి ఇది ఎంతో ఉపయోగపడుతుందని



ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రెవెన్యూ, గృహ నిర్మాణం & సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావులకు ఎమ్మెల్యే ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.చివరిగా ఈ ప్రాజెక్టుకు సంబంధించిన పర్యావరణ అనుమతుల సాధనలో కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వం, నీటిపారుదల శాఖ అధికారులు, న్యాయ నిపుణులు, సంబంధిత అధికారులు ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అభినందనలు తెలియజేశారు.

# రోడ్డుపై ఇసుక లారీల అంతరాయం....

-ఊపిరాడని మణుగూరు ,ఏటూరునాగరంమార్గం!

-సాంబాయిగూడెం, రామానుజవరం ఇసుక ర్యాంపుల వద్ద నిత్యం నరకం...

-కిలోమీటర్ల మేర స్తంభిస్తున్న వాహనాలు.. పట్టించుకోని అధికార యంత్రాంగం..

-ట్రాఫిక్‌లో చిక్కుకుని అంబులెన్స్‌లోనే రోగుల ప్రాణాలు పోతున్నా నిమ్మకు నీరెత్తనట్లు వ్యవహరిస్తున్నతీరు.

అక్షర కలం/ పినపాక..

మణుగూరు మండల పరిధిలోని ప్రధాన రహదారి ఇసుక లారీల అడ్డాగా మారింది.సాంబాయిగూడెం, రామానుజవరం ఇసుక ర్యాంపుల నుంచి ఇసుక తరలించే భారీ లారీలు మణుగూరు నుండి ఏటూరునాగారం వెళ్లే ప్రధాన రహదా రిని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాయి. రోడ్డుకు ఇరువైపులా, కొన్నిసార్లు ఏకంగా రోడ్డు మధ్యలోనే కిలోమీటర్ల మేర ఈ లారీలను నిలిపివే స్తుండ టంతో సామాన్య వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ అస్తవ్యస్త ట్రాఫిక్ కేవలం ప్రయాణ సమయాన్ని మాత్రమే వృథా చేయడం లేదు, ఏకంగా అమా యకుల ప్రాణాలను బలిగొంటోంది. అత్యవసర పరిస్థి తుల్లో రోగులను ఆసుపత్రికి తరలించే అంబులెన్సులు సైతం ఇసుక లారీల దండు మధ్య చిక్కుకుపోతున్నాయి.గతంలో ట్రాఫిక్ జామవడంతో సమయానికి ఆసుపత్రికి చేరలేక, అంబులెన్స్‌లోనే రోగులు ప్రాణాలు కోల్పోయిన అత్యంత దారుణమైన అమానవీయ ఘటనలు ఇక్కడ చోటుచేసు కున్నా యి.ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగిని కాపాడుకోవడానికి కుటుంబ సభ్యు లు కిలోమీటర్ల దూరం రోడ్డుపై మోసుకుంటూ వెళ్లాల్సిన దుస్థితి దాపురించిందంటే ఇక్కడి పరిస్థితి ఎంత ఘోరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

-నిబంధనలు గాల్లోకి.. ద్విచక్ర వాహనదారుల బెంబేలు:

ఒకే లేన్ ఉన్న ఈ రహదారిపై లారీలు వరుస కట్టడంతో ద్విచక్ర వాహన దారులు, ఆటోలు కనీసం నడవడా నికి కూడా స్థలం లేక భయాందోళనల మధ్య ప్రయాణిస్తున్నారు.ఇసుక లారీ డ్రైవర్లు ఇష్టారాజ్యంగా వాహనాలు నిలపడం, వేగంగా నడపడం వల్ల నిత్యం చిన్నపాటి ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. వర్షాలు పడితే రోడ్డు మరింత అధ్వాన్నంగా మారి వాహనాలు గంటల తరబడి నిలిచి పోతున్నాయి.ఒక వైపు గోదావరి ఇసుక ర్యాంపుల గుత్తేదారులకు కాసుల వర్షం కురుస్తుంటే,స్థానిక ప్రజలకు మాత్రం ఇది శాపంగా మారింది.

-అధికారుల అలసత్వంపై స్థానికుల ఆగ్రహం:



ఈ సమస్య ఈరోజుది కాదు.ఎన్నో నెలలుగా స్థానిక ప్రజలు,వాహన దారులు మొరపెట్టుకుంటున్నా, పత్రికల్లో వార్తలు వస్తున్నా సంబం ధిత పోలీసు, రెవెన్యూ, మైనింగ్ అధికారులు మాత్రం కన్నెత్తి చూడ టం లేదనే విమర్శలు బలంగా వినిపి స్తున్నాయి.ఇసుక ఆదాయంపై ఉన్న శ్రద్ధ, సామాన్య ప్రజల ప్రాణాల పై అధికారులకు, కాంట్రాక్టర్లకు లేకపోవడం అత్యంత విచారకరం.

-తక్షణ చర్యలు చేపట్టాలి:

ఇకనైనా అధికార యంత్రాంగం నిద్రమత్తు వీడి,తక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.ఇసుక లారీల పార్కింగ్ కోసం ప్రత్యేకంగా యార్డులను ఏర్పాటు చేయాలని, ప్రధాన రహదా రిపై లారీలు నిలపకుండా ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కోరుతున్నారు.మరో ప్రాణం గాల్లో కలవకముందే ఈ ఇసుక లారీల పద్మవ్యూహం నుండి మణుగూరు ప్రయాణికులకు విముక్తి కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ప్రభుత్వం వెంటనే స్పందించా లని వాహన దారులు కోరుకుంటు న్నారు.

# వరద సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేసిన

-మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు :

-గోదావరిఖని, పెద్దపల్లి, రామగుండంలో పరిస్థితిపై సచివాలయంనుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన మంత్రి :

హైదరాబాద్, జులై 30: ( అక్షర కలం న్యూస్ ):

గోదావరిఖని, పెద్దపల్లి, సింగరేణి ఏరియాలో రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలతో పలు కాలనీలు జలమయమైన నేపథ్యంలో సహాయక, పునరావాస చర్యలను యుద్ధప్రాతిపదికన చేపట్టాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అధికారులను ఆదేశించారు. గురువారం డా. బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి పెద్దపల్లి జిల్లా కలెక్టర్, సింగరేణి సీఎండీ, ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తెలంగాణ జెన్‌కో సీఎండీ, రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ (ఆర్‌ఎఫ్‌సీఎల్) అధికారులు, రామగుండం పోలీసు కమిషనర్ తదితర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితిని సమీక్షించారు. వీడియో కాన్ఫరెన్సులో ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట వెంకటరమణారావు, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ కూడా పాల్గొన్నారు. రామగుండం పారిశ్రామికవాడలో నిలిచిపోయిన వరద నీరు తొలగించేందుకు నాలాల్లో ఉన్న ఆటంకాలను తొలగించాలని మంత్రి ఆదేశించారు. వరద సహాయక చర్యల్లో సింగరేణి, ఎన్‌టీపీసీ అధికారులు చురుకుగా పాల్గొని జిల్లా యంత్రాంగానికి పూర్తి సహకారం అందించాలని కోరారు. వీర్లపల్లి గ్రామంలోకి నివాస ప్రాంతాలు జలమయమైన నేపథ్యంలో గ్రామంలోకి వరద నీరు చేరకుండా ప్రత్యామ్నాయ మార్గంలో మళ్లించే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామస్తులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మించుకునేలా ఇంటి స్థలాల పట్టాలు అందజేసే ప్రక్రియను వేగవంతం చేయాలని పెద్దపల్లి కలెక్టర్‌కు సూచించారు. రామగుండంలో విపత్తు నివారణ బృందాలను పూర్తిస్థాయిలో రంగంలోకి దింపాలని సూచించారు. పెద్దపల్లి జిల్లాలోని 1,021 చెరువుల్లో దాదాపు 80 శాతం నిండటం సంతోషకరమని మంత్రి పేర్కొన్నారు. దీంతో జిల్లాలోని సుమారు 2.7 లక్షల ఎకరాలకు సాగునీటి కొరత ఉండదన్నారు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి



నిల్వలు గురువారం సాయంత్రానికి 20 టీఎంసీలకు చేరనున్నాయని తెలిపారు. నీటి మట్టాలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఒక్క చుక్క నీరూ వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వరద ప్రభావిత వీర్లపల్లి గ్రామంతో పాటు గోదావరిఖని, రామగుండం పారిశ్రామికవాడ ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించాలని సింగరేణి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు సూచించారు. రద సహాయక చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న రామగుండం మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను మంత్రి అభినందించారు.

# దిల్ సుక్ నగర్ పీఅండ్ టీ కాలనీలో నాలాపై స్లాబ్ ను వెంటనే పూర్తి చేయండి..

-అధికారులకు ఆదేశించిన మధుయాష్కీగౌడ్:



హైదరాబాద్ : జులై 30,( అక్షర కలం న్యూస్ ):

మాజీ పార్లమెంట్ సభ్యులు, టీపీసీసీ క్యాంపెయినింగ్ కమిటీ చైర్మన్ మధు యాష్కీ గౌడ్ గారు.. ఈ రోజు గడ్డి అన్నారం డివిజన్‌లోని పీఅండ్‌టీ కాలనీ, హన్స్వీన్ మటన్ షాప్ చౌరస్తా వద్ద రోడ్డు తవ్వి వదిలేసిన సమస్యను ప్రత్యక్షంగా పరిశీలించారు. సరూర్‌నగర్ చెరువుకు అనుసంధానంగా ఉన్న డ్రెయిన్ వద్ద చాంబర్‌లో గుర్రెపు డెక్క ఇరుక్కుపోయిన పరిస్థితిలో నాలా స్లాబును తొలగించి, వాటర్‌ప్రూఫింగ్ పనులు నిర్వహించిన అనంతరం తిరిగి స్లాబును అమర్చకుండా వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు మధుయాష్కీ గౌడ్ గారికి వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై వెంటనే స్పందించిన మధుయాష్కీ గౌడ్ గారు ఈ రోజు ఉదయం ఆ ప్రాంతాన్ని సందర్శించి.. డిప్యూటీ కమిషనర్, ఈఈ లతో మాట్లాడారు. వెంటనే నాలాపై కొత్త స్లాబ్ ను వేసి ప్రజలకు ఇబ్బందులు తొలగించాలన్నారు. రానున్న తెలంగాణ రాష్ట్ర అతిపెద్ద పండుగ అయిన ఆషాఢ మాసం బోనాల పండుగ సందర్భంగా అమ్మవారికి బోనం సమర్పించే మహిళలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వెంటనే ఆ చాంబర్‌పై స్లాబ్ పనులు పూర్తి చేసి ప్రజలకు రాకపోకల చేసేలా ఇబ్బందులను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు మద్దెల సునీల్ బాబు , సీనియర్ నాయకులు తులసి శ్రీనివాస్ , పార్టీ మాజీ అధ్యక్షులు బద్దుల వేణుగోపాల్ యాదవ్ ,మాజీ కౌన్సిలర్ కందికంటి ప్రేమ నాథ్ గౌడ్ , బబ్బూరి ఆనంద్ కుమార్ , పండరీనాథ్ , శరత్ యాదవ్ మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిరసన దినంగా విజయవంతం చేయాలి.

-తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య.



అక్షర కలం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి :-

ఆదివాసి హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ, ఏఐడబ్ల్యూసీఏ, ఆధార్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర కమిటీల ఆధ్వర్యంలో ఆగస్టు 9 న నిర్వహించే ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని "నిరసన దినంగా" రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుం దెబ్బ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణాల లక్ష్మయ్య తెలిపారు. గురువారం జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని 244వ అధికరణ ప్రకారం అమలులో ఉన్న ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం, పేసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం--2006 వంటి చట్టాలు ఆదివాసీల రక్షణ కోసం ఉన్నప్పటికీ, వాటి అమలులో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని ఆయన విమర్శించారు. ఆదివాసీల భూములు, అటవీ హక్కులు, స్వయం పాలన, జీవనాధారాలు తీవ్ర ప్రమాదంలో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీలు సాగు చేస్తున్న సుమారు 8 లక్షల ఎకరాల భూములకు హక్కు పట్టాలు ఇవ్వాలని, పోడు భూములకు శాశ్వత పట్టాలు మంజూరు చేయాలని, 1/70 చట్టాన్ని కచ్చితంగా అమలు చేయాలని, 2023లో సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న 1/70 చట్టానికి సంబంధించిన కేసుల్లో ప్రభుత్వం ఆదివాసీల హక్కులను కాపాడేలా వెంటనే ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదిక మీద జోక్యం చేసుకోవాలని డిమాండ్ ఆయన చేశారు. జీవో నెం.3 స్థానంలో చట్టబద్ధమైన కొత్త జీవోను తీసుకురావాలని, ఆదివాసులపై అటవీ శాఖ నమోదు చేసిన కేసులను రద్దు చేయాలని, ఐటీడీఏలో గతంలో ఉన్న 29 ప్రభుత్వ శాఖలను పునరుద్ధరించాలని, ఐదవ షెడ్యూల్, 1/70 చట్టం, పేసా చట్టం, అటవీ హక్కుల గుర్తింపు చట్టం--2006లను పకడ్బందీగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆగస్టు 9న రాష్ట్రంలోని అన్ని జిల్లా, మండల కేంద్రాల్లో తుడుం దెబ్బ, ఏఐడబ్ల్యూసీఏ, ఆధార్ సొసైటీ ఆధ్వర్యంలో భారీ నిరసన ర్యాలీలు నిర్వహిస్తామని, నల్ల బ్యాడ్జీలు, నల్ల జెండాలు, నల్ల టోపీలు, నల్ల టీ-షర్టులు ధరించి నిరసన తెలుపుతామని తెలిపారు. అనంతరం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, కొమరం భీమ్ విగ్రహాలకు నివాళులర్పించి సంబంధిత అధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తామని అన్నారు. ఆదివాసీ ప్రజలు, విద్యార్థులు, యువత, మహిళలు, ఉద్యోగులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజా సంఘాల నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆగస్టు 9 ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని నిరసన దినంగా విజయవంతం చేయాలని రమణ లక్ష్మయ్య పిలుపునిచ్చారు. రాజ్యాంగబద్ధమైన ఆదివాసీ హక్కులను కాపాడుకునేందుకు ఐక్య ఉద్యమమే మార్గమని ఆయన స్పష్టం చేశారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# బి ఆర్ ఎస్ వి ఆధ్వర్యంలో నారాయణపేట డిఈఓ కు వినతిపత్రం :



అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి,( జూలై,30)

నారాయణపేట: ఎం పి పి ఎస్ శ్రీరాంనగర్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు అరుణ టీచర్‌ను తిరిగి అదే పాఠశాలలో కొనసాగించాలని కోరుతూ బి ఆర్ ఎస్ వి నారాయణపేట జిల్లా అధ్యక్షులు కోరం శివరాజ్ రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయానికి వినతిపత్రం అందజేశారు. నారాయణపేట డి ఇ ఒ కార్యాలయంలో సూపరింటెండెంట్ నర్సింహా రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. శ్రీరాంనగర్ పాఠశాలలో బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా చదువుతున్నారని, అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉంటే విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతుందని నాయకులు తెలిపారు. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంటే విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉందని, డ్రాప్‌అవుట్లు కూడా పెరిగే ప్రమాదం ఉందని వారు పేర్కొన్నారు. అరుణ టీచర్‌ను యథాస్థానంలోనే కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ ఆఫీసర్ శ్రీనివాసులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఉమ, వర్ష, శోభన, నరేష్ కుమార్, రాజు, అశోక్‌తో పాటు బి ఆర్ ఎస్ నాయకులు తరుణ్ కుమార్, షేక్ సమీ తదితరులు పాల్గొన్నారు.

# సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు

**-కంట్రోల్ రూమ్ నెంబర్ 08455-276155**

అక్షరకలం, అందోలు:



భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో సంగారెడ్డి జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో అప్రమత్తమైంది. జిల్లా కలెక్టరేట్‌లో 24 గంటల పాటు పనిచేసే ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. ప్రజల నుండి అందే అత్యవసర ఫిర్యాదులు, సమాచారం, నష్టం వివరాలను వెంటనే స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు చేరవేసి తక్షణ చర్యలు తీసుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలు భారీ వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితులు, వరదలు, రహదారి అంతరాయాలు, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సమస్యలు లేదా ఇతర ప్రమాదాలకు సంబంధించిన సమాచారాన్ని (08455-276155) నంబర్‌కు వెంటనే తెలియజేయాలని సూచించారు. కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించడానికి సిబ్బందిని మూడు షిఫ్ట్‌ల్లో నియమించామని, అందిన ప్రతి ఫిర్యాదును రిజిస్టర్‌లో నమోదు చేసి సంబంధిత తహసీల్దార్‌కు వెంటనే పంపించి అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

**-జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య**

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 30:



ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి చంద్రయ్య ప్రకటనలో తెలిపారు. ఫిన్లాండ్ విదేశీ ఎక్స్‌పోజర్ విజిట్‌కు ఎంపికై విజయవంతంగా పర్యటన పూర్తి చేసుకుని వచ్చిన జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులను ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారని తెలిపారు. జిల్లాలోని జన్నారం మండలం అక్కపెల్లిగూడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశా లకు చెందిన జాజల శ్రీనివాస్, కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దాముక కమలాకర్ ఫిన్లాండ్ పర్యటనకు ఎంపికయ్యారని, వారి పాఠశాలలో వరుసగా 450, 600 మంది విద్యార్థుల నమోదు ఉండటంతో రాష్ట్రంలో అత్యధిక విద్యార్థుల నమోదు కలిగిన పాఠశాలలుగా గుర్తింపు పొందాయని తెలిపారు. ఫిన్లాండ్ పర్యటనలో విద్యార్థి కేంద్రిత బోధన, సృజనాత్మక అభ్యాస పద్ధతులు, తరగతి గది నిర్వహణ తదితర అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారని, అక్కడి ఉత్తమ విద్యా విధానాలను స్థానిక అవసరాలకు అనుగుణంగా అమలు చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ విద్యా రంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మరింత మంది ఉపాధ్యాయులను విదేశీ ఎక్స్‌పోజర్ విజిట్‌లకు పంపడంతో పాటు ప్రభుత్వ వ్యయంతో విదేశాలలో ఉన్నత విద్యాభ్యాసానికి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, అంకితభావంతో పనిచేయాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

# విద్యుత్ భద్రత- వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**-సంగారెడ్డి గ్రామీణ ఎస్ ఐ మధుసూదన్ రెడ్డి**

అక్షర కలం, అందోలు:



ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ ప్రమాదాల అవకాశాలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సంగారెడ్డి రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ మధుసూదన్ రెడ్డి సూచించారు. ఇటీవల రాష్ట్రంలో వర్షాల సమయంలో విద్యుత్ షాక్‌ల వల్ల ప్రమాదాలు చోటు చేసుకున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించడం అత్యంత అవసరమన్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వాహనదారులు రోడ్లపై వెళ్లేటప్పుడు నెమ్మదిగా వెళ్లాలని, ప్రజల ప్రాణ భద్రతే మా ప్రాధాన్యమని తెలిపారు. వర్షాకాలంలో చిన్న నిర్లక్ష్యం కూడా ప్రాణాపాయానికి దారితీయవచ్చని ప్రతి ఒక్కరూ విద్యుత్ భద్రతా నియమాలను పాటించి, ప్రమాదాలను నివారించేందుకు పోలీసు, విద్యుత్ శాఖ అధికారులతో సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

**-ప్రజలు తప్పనిసరిగా పాటించవలసిన జాగ్రత్తలు:**

తెగిపోయిన లేదా కిందపడిన విద్యుత్ తీగలకు ఎట్టి పరిస్థితుల్లోనూ దగ్గరగా వెళ్లవద్దు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, జంక్షన్ బాక్సుల వద్ద నీరు నిల్వ ఉంటే వాటికి దూరంగా ఉండండి. తడి చేతులతో విద్యుత్ స్విచ్‌లు లేదా ఎలక్ట్రికల్ పరికరాలను తాకవద్దు. పిల్లలను విద్యుత్ స్తంభాలు, తీగలు, ట్రాన్స్‌ఫార్మర్ల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తగా చూడాలి. ఇంట్లో వైరింగ్, ఎర్తింగ్ సరిగా ఉందో లేదో పరిశీలించుకుని, లోపాలు ఉంటే అర్హత కలిగిన ఎలక్ట్రీషియన్‌తోనే మరమ్మతులు చేయించాలి. చెట్లు విద్యుత్ తీగలపై పడినా లేదా తీగలు వాలి కనిపించినా వెంటనే విద్యుత్ శాఖకు సమాచారం ఇవ్వాలి. వర్షం, ఉరుములు, మెరుపుల సమయంలో విద్యుత్ స్తంభాలు లేదా చెట్ల కింద నిలబడవద్దు. ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే నేరుగా తాకకుండా, ముందుగా విద్యుత్ సరఫరా నిలిపివేసి సహాయక చర్యలు చేపట్టి వెంటనే 108 లేదా సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి.

# భారీ వర్షాల నేపథ్యంలో యామాపూర్

**-ఫకీర్ కొండాపూర్ గ్రామాల వాగును పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పి...**

జగిత్యాల జూలై 30 (అక్షర కలం)



భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. గురువారం భారీ వర్షాల కారణంగా జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం మండలం యామాపూర్--ఫకీర్ కొండాపూర్ గ్రామాల మధ్య ప్రవహిస్తున్న వాగును జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్, జిల్లా పోలీసు సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తో కలిసి పరిశీలించారు.వాగులో ప్రవాహ పరిస్థితులను పరిశీలించి ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. వర్షాల కారణంగా వాగుల ప్రవాహం ఎక్కువ ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు.లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రమాదకర ప్రాంతాల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలు సమన్వయంతో పనిచేసి ప్రజల ప్రాణాలకు ఎలాంటి ముప్పు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు చేపల వేటకు వెళ్లొద్దని, అదేవిధంగా నది ప్రవాహ ప్రాంతాలను చూడడానికి ప్రజలు రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో జిల్లా కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ కు వెంటనే సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు.

# అత్యవసర పరిస్థితులలో ప్రజలకు అందుబాటులో ఉంటాం...

**-రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి**

మందమర్రి, జూలై 30 అక్షర కలం:



ప్రస్తుతం నెలకొన్న వర్ష పరిస్థితులలో ప్రజలకు అందుబాటులో ఉంటూ అత్యవసర సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి తెలిపారు. గురువారం పట్టణ మున్సిపల్ పరిధిలోని 19, 3వ వార్డులలో నెలకొన్న స్థితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, ఎసిపి కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితులలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర సేవలను అందించేందుకు అధికార యంత్రాంగం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని తెలిపారు. చెన్నూరు నియోజకవర్గ పరిధిలోని కొన్ని గ్రామాలకు వరద కారణంగా రవాణా ఇబ్బందులు ఏర్పడే పరిస్థితిని అధిగమించేందుకు రహదారి అనుసంధానం అంశంపై అటవీశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 19వ వార్డు కామాఖ్య అమ్మవారి ఆలయానికి వెళ్లే దారిలో నీటి ప్రవాహాన్ని పరిశీలించడం జరిగిందని, వెంకటేశ్వర టెంపుల్ ఏరియా 3వ వార్డులో కూలిన ఇంటి గోడ స్థితిని పరిశీలించడం జరిగిందని తెలిపారు. సంబంధిత ఇంటి యజమానులకు పరిహారం అందించి ఇంటిని నిర్మించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. కోటపల్లి మండలం ఆల్గాం గ్రామంలో కూలిన ఇంటి గోడకు సంబంధించి చర్యలు తీసుకుంటున్నామని, గ్రామాలలో ఏర్పడిన పరిస్థితులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ క్రమంలో అటవీశాఖ అనుమతులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి సమర్పించినట్లయితే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అంతకుముందు జిల్లా కలెక్టర్ మున్సిపల్ కార్యాలయాన్ని మున్సిపల్ కమిషనర్ రాజలింగు, మండల తహశీల్దార్ సతీష్ కుమార్ తో కలిసి ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ, భూభారతి, రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఎన్యూమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ త్వరగా పూర్తిచేసే విధంగా ప్రత్యేక దృష్టి సారించాలని, ఇంకా ఫారాలు అందించని వారిని గుర్తించి బూత్ స్థాయి ఏజెంట్ల ద్వారా సేకరించే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. సాదా బైనామా, భూభారతి, రెవెన్యూ సదస్సుల దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి నిబంధనల ప్రకారం త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ పరిధిలో పెండింగ్ పన్ను బకాయిలను త్వరగా వసూలు చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# మెగా ఎగుమతి ప్రోత్సాహకం

రంగారెడ్డి అక్షర కలం




జిల్లాలో ఎగుమతులను ప్రోత్సహించడానికి మరియు ఇప్పటికే ఉన్న పరిశ్రమలను తమ ఉత్పత్తులను ఎగుమతి చేసేలా ప్రోత్సహించడానికి, మెగా ఎగుమతి ప్రోత్సాహక కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ శ్రీమతి ఐతే. కిరణ్మయి కొప్పిశెట్టి గారి ఆధ్వర్యంలో 30-07-2026 నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా నందు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ గారు మాట్లాడుతూ తెలంగాణ ఆర్థిక వ్యవస్థలో రంగారెడ్డి జిల్లా ఒక వ్యూహాత్మక స్థానాన్ని ఆక్రమించి, రాష్ట్రంలోని అత్యంత చైతన్యవంతమైన పారిశ్రామిక మరియు ఎగుమతి ఆధారిత జిల్లాలలో ఒకటిగా అవిర్భవించింది అని అన్నారు మరియు హైదరాబాద్‌కు సమీపంలో ఉండటం వలన, ఈ జిల్లా మౌలిక సదుపాయాలు, కనెక్టివిటీ, నైపుణ్యం గల మానవ వనరులు, పరిశోధనా సంస్థలు, మరియు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లకు ప్రాప్యత పరంగా గణనీయమైన ప్రయోజనాలను అందిస్తుంది అని అన్నారు. సంవత్సరాలుగా, ఇది ఐటీ ఒ ఐటీఈఎస్, రక్షణ ఒ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, ఇంజనీరింగ్, ఫార్మాస్యూటికల్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్యాకేజింగ్ మెటీరియల్స్, సోలార్ ప్యానెల్స్, ప్లాస్టిక్ ఉత్పత్తులు, మరియు క్వార్ట్జ్ ఒ ఫెల్డ్‌స్పార్ ఆధారిత పరిశ్రమలలో బలమైన ఉనికితో ఒక ప్రధాన తయారీ మరియు సేవల కేంద్రంగా అభివృద్ధి చెందింది అని పేర్కొన్నారు. డీఐఎఫ్‌టీ అధికారుల సమన్వయంతో (DEH) District as Export Hub కింద నిర్వహించబడిన ఈ కార్యక్రమంలో శ్రీ ఎస్.ఎ. చవాన్, జాయింట్ డీజీఎఫ్‌టీ, శ్రీమతి ఎం. శ్రీ లక్ష్మి, జీఎం, డీఐసీ, శ్రీమతి ఎన్. సుమతి, అసిస్టెంట్ డైరెక్టర్, ఎంఎస్ఎంఈ, ఏపీఈడీఏ, వాల్‌మార్ట్, ఇండియా పోస్ట్ వంటి ఎగుమతి ప్రోత్సాహక మండళ్ల ప్రతినిధులు, ఇతర శాఖల అధికారులు మరియు పలు సంస్థల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొని, వివిధ పథకాలు మరియు అవకాశాలపై అవగాహన కల్పించారు మరియు ఇ-కామర్స్ ద్వారా వ్యాపార అభివృద్ధిపై అవగాహన కల్పించారు. అధికారులు పథకాలకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, ఎగుమతి విధానాలు, అంతర్జాతీయ మార్కెటింగ్ అవకాశాలు, నాణ్యత ప్రమాణాలు, ఆర్థిక సహాయం, ఇ-కామర్స్ ద్వారా వ్యాపార విస్తరణ మరియు ఎగుమతుల సమయంలో వారు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై వివరణ ఇచ్చారు.

# పూరిగుడిసెలు లేని తెలంగాణయే లక్ష్యం





## -అన్నపురెడ్డిపల్లిలో రూ.2.77 కోట్ల అభివృద్ధి పనులకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శంకుస్థాపన
## -ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి గృహప్రవేశాల్లో పాల్గొన్న మంత్రి
## -సీతారామ నిర్వాసితుల సమస్యలు వారంలోగా తేల్చాలని అధికారులకు స్పష్టమైన ఆదేశం

అక్షర కలం/ భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి :

అన్నపురెడ్డిపల్లి : ప్రజా సంక్షేమమే పరమావధిగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, తెలంగాణలో పూరిగుడిసెలు లేని పేదరికరహిత సమాజాన్ని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన సంకల్పమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. గురువారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, కలెక్టర్ అంకిత్‌లతో కలిసి రూ.2.77 కోట్లకు పైగా అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

**- మౌలిక వసతుల కల్పనకు రూ.2.77 కోట్లు**

గ్రామీణ ప్రాంతాల సమగ్ర వికాసానికి, మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యమిస్తోందని మంత్రి పేర్కొన్నారు. పర్యటనలో భాగంగా గుంపెన గ్రామంలో రూ.45 లక్షలతో 9 అంతర్గత సీసీ రోడ్ల పనులకు, నరసాపురంలో ఉపాధి హామీ నిధులు రూ.117.30 లక్షలతో సీసీ రోడ్లు మరియు కల్వర్టుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. భీమునిగూడెంలో రూ.20 లక్షలతో నిర్మించిన నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఆయన, కోండాయిగూడెం డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో రూ.20 లక్షలతో, పెద్దిరెడ్డిగూడెంలో రూ.75.50 లక్షలతో చేపట్టే రహదారుల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.

**- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఇంట గృహప్రవేశాల కోలాహలం**

అనంతరం మండలంలోని పలు గ్రామాల్లో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ మహోత్సవాల్లో మంత్రి స్వయంగా పాల్గొన్నారు. పెద్దిరెడ్డిగూడెంలో అగ్గి రాజమ్మ, గుంపెనలో మాయారా వసంత, భీమునిగూడెంలో వాడే సుజాత, నరసాపురంలో తిరుమలదేవి అనిత, చీపుడు జ్యోతి, ఊటుపల్లిలో మొల్లచవుకు కవిత, రంగాపురంలో వేముల కృష్ణయ్య, పెనుగొండ కోటమ్మల నూతన గృహాల్లో అడుగుపెట్టి వారికి శుభాకాంక్షలు అందజేశారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతాయని, అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**- వారంలోగా సీతారామ నిర్వాసితుల సమస్యల పరిష్కారం**

ప్రాజెక్టు భూనిర్వాసితుల సమస్యలపై స్పందించిన మంత్రి పొంగులేటి, సీతారామ ప్రాజెక్టు బాధితుల సమస్యలను ప్రాధాన్యతతో పరిశీలించి వారం రోజుల్లోగా పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, హౌసింగ్ పీడీ, జిల్లా పంచాయతీ అధికారి అనూష, తాసిల్దార్, ఇతర ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# విద్యార్థులు నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ :

## -విజేతలకు ప్రశంసా పత్రాలు షీల్డ్ ప్రధానం :

అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, (జులై 30)




ధన్వాడ: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో "నశా ముక్త్ భారత్ అభియాన్" జిల్లా స్థాయి కార్యక్రమం కొండాపూర్ గిరిజన గురుకుల ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని నశా ముక్త్ భారత్ అభియాన్ మరియు మేరా యువ భారత్ సంయుక్తంగా నిర్వహించి, విద్యార్థులలో మత్తు పదార్థాల దుష్పరిణామాలపై అవగాహన పెంపొందించేందుకు నుక్కడ్ నాటకాలు, పాటల పోటీలు, వ్యాసరచన, పోస్టర్ చిత్రణ వంటి సృజనాత్మక పోటీలు ఏర్పాటు చేశారు. పోటీలలో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులకు జిల్లా స్థాయిలో విజేతలుగా గుర్తించి ప్రశంసా పత్రాలు మరియు బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా ధన్వాడ పోలీస్ స్టేషన్ ఎస్ఐ కుమారి మహేశ్వరి పాల్గొని విజేతలకు బహుమతులు అందజేసి అభినందనలు తెలిపారు. కలాశాల ప్రిన్సిపాల్ శ్రీ రాజారాం మత్తు పదార్థాల వల్ల కలిగే శారీరక, మానసిక మరియు సామాజిక నష్టాలను వివరించారు మరియు విద్యార్థులకు మత్తు నుండి దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా యువజన అధికారి వి. కోట నాయక్ గారు యువత దేశ భవిష్యత్తుకు బలమైన పునాది అని పేర్కొని, ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించి మత్తు పదార్థాలకు దూరంగా ఉండమని ప్రేరేపించారు. అనంతరం విద్యార్థులు నశా ముక్త్ భారత్ ప్రతిజ్ఞ చేశారు. ప్రత్యేకంగా నుక్కడ్ నాటకంలో పాల్గొన్న విద్యార్థులు మత్తు వ్యసనాల వల్ల వ్యక్తి, కుటుంబం మరియు సమాజంపై వచ్చే దుష్పరిణామాలను హృదయానికి హత్తుకునేలా ప్రదర్శించారు మరియు కార్యక్రమాన్ని విశేషంగా నిలబెట్టేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీ రాజారాం, వైస్-ప్రిన్సిపాల్ శ్రీ శ్రీనివాస్, డాక్టర్ శ్రీనాథ్, శ్రీ రెబ్బ లక్ష్మయ్య, ఫిజికల్ డైరెక్టర్ శ్రీ రామ్మోహన్, వివిధ కళాశాలల అధ్యాపకులు, యువత మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. సంప్రదించవలసిన ప్రధాన వ్యక్తి: జిల్లా యువజన అధికారి: శ్రీ వి. కోట నాయక్

# భారీ వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి.....

## -రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు......





మెదక్, జూలై 30(అక్షరకలం):

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. వర్షాలు, వరదలపై సీఎస్ సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పలు జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు జిల్లాల్లో అతి భారీ నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయని, ఈ వర్షాలు వరదలపై ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులంతా వారి వారి కేంద్ర కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. అన్ని జిల్లాల్లో కంట్రోల్ రూమ్ లు 24 గంటలు పని చేయాలని అన్నారు. జిల్లాల వారిగా కురిసిన వర్షాలు, డ్యాం లలో చేరిన నీరు, దెబ్బతిన్న, రోడ్లు వంతెనలు, చేపట్టిన సహాయ చర్యల గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగినట్లు సమాచారం అందితే తక్షణమే స్పందించాలని వివరించారు. గ్రామీణ స్థాయిలో ప్రజలు అప్రమత్తంగా ఉండేలా అధికారులు టామ్ టామ్ చేయాలన్నారు. పారిశుద్ధ్య పనులు నిరంతరం కొనసాగించాలని, వైద్యారోగ్య శాఖా అధికారులు అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. లోతట్టు ప్రాంతాలు, చెరువులు, కుంటలు, నదుల పరిసర ప్రాంతాలలోనికి పశుకాపరులు, మత్స్యకారులు, ఇతరులు ఎవరు వెళ్లకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. డిజిపి సి.వి. ఆనంద్ మాట్లాడుతూ, .భారీ వర్షాలు వరదల వల్ల ప్రజలు ఎవరికి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ వివిధ శాఖల అధికారులతో సమన్వయంతో పనిచేస్తుందని వివరించారు. పోలీసు శాఖ తరపున అవసరమైన సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా కలెక్టరేట్లోని సమావేశం మందిరం నుంచి ఈ వీసీలో కలెక్టర్ ప్రతిమా సింగ్, మాట్లాడుతూ.. ఆస్తి, నష్టం ప్రాణ నష్టం జరగకుండా చూడాలని , గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో వర్షం నీరు నిలవకుండా చూడాలని , విద్యుత్ స్తంభాలు తాకవద్దని , పశువులను సురక్ష ప్రాంతాల్లో ఉంచాలని, పురాతన భవనాలలో నివసిస్తున్న వారెవరైనా ఉంటే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డి ఆర్ ఓ అంబ దాస్ రాజేశ్వర్,జిల్లా అధికారులు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## నారాయణపేట ను డ్రగ్స్ రహిత జిల్లాగా నిర్మిద్దాం :
### -జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక:
### -జిల్లా ఎస్పీ డాక్టర్ వినిత్ :

అక్షర కలం, నారాయణపేట జిల్లా ప్రతినిధి, (జులై,30)

డ్రగ్స్, గంజాయి వంటి మాదకద్రవ్యాల నుంచి సమాజాన్ని విముక్తి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర ఈగల్ ఫోర్స్ ఎస్పీ శ్రీమతి పీవీ. పద్మజ, జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక, జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ చెప్పారు. చెడు వ్యసనాలను దూరంగా తరిమిద్దాం --- యువతకు మాదకద్రవ్యాలకు చెందిన ఎలాంటి ప్రలోబాలకూ అవకాశం ఇవ్వకూడదంటున్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ గార్డెన్లో తెలంగాణ ఈగల్ ఫోర్స్, నారాయణపేట జిల్లా పోలీసు శాఖ సంయుక్తంగా భారీ డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు, ఆశా వర్కర్లు, సుమారు 1000 మంది విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ ఈగల్ ఫోర్స్ ఎస్పీ పీవీ. పద్మజ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు ప్రసంగించారు. పీవీ. పద్మజ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఏర్పాటు చేయబడిన ఈగల్ ఫోర్స్ మాదకద్రవ్య నిర్మూలనలో సమర్థవంతంగా దాడులు చేపడుతున్నట్లు తెలిపారు. డ్రగ్స్ సమస్యను ప్రభుత్వమే కాదు ప్రతి పౌరుడి భాగస్వామ్యంగా తీసుకోవాల్సిందన్నారు. యువత తమ లక్ష్యాలను దృష్టిలో పెట్టుకుని చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నారని లేదా విక్రయం చేయుతున్నట్లు గమనిస్తే వెంటనే 1908 టోల్‌ఫ్రీ లేదా సమీప పోలీసు అంతర్గతులకు సమాచారం ఇవ్వమని కోరారు. జిల్లా కలెక్టర్ సీహెచ్. ప్రియాంక విద్యార్థులకు ఏప్రలోభాలకు అడ్డుగా ఉండాలని సూచించారు. "ఒక్కసారి తీసుకుంటే ఎవరికీ తెలియదు" అనే భావన తప్పని స్పష్టం చేసి, స్నేహితులు కూడా ఇలాంటి దారుణ పనులను ప్రోత్సహిస్తే వారు నిజమైన స్నేహితులు కానన్నారు. విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులు, లెక్చరర్లు విద్యార్థుల ప్రవర్తనపై ప్రత్యేక నిఘా పెట్టాలని, డ్రగ్స్ వినియోగనం లేదా విక్రయం గుర్తిస్తే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. అలవాటుపడ్డ విద్యార్థులను గుర్తించి డీ-అడిక్షన్ కేంద్రాలకు పంపించి చికిత్స జరపిస్తామని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అన్నారు --- డ్రగ్స్ దేశ భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారినంటూ, యువతను లక్ష్యంగా చేసుకుని డ్రగ్స్‌ను ఆయుధంగా వాడే ప్రయత్నాలు జరుగుతున్నాయని హెచ్చరించారు. ఇది జాతీయ భద్రతకు కూడా ముప్పు కావడం వల్ల ప్రతి పౌరుడు, ముఖ్యంగా యువత అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎవరైనా అక్రమ రవాణా, విక్రయం లేదా వినియోగం చేస్తుంటే వెంటనే 1908 లేదా డయల్-100కు సమాచారము అందించాలని, సమాచారం ఇచ్చేవారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అప్పక్‌పల్లి ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డ్రగ్స్ డీ-అడిక్షన్ (రీహాబ్) సెంటర్‌ను అధికారులు పరిశీలించి, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని యువకులతో మాట్లాడి కౌన్సెలింగ్ నిర్వహించారు. అనంతరం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన రివ్యూ సమావేశంలో జిల్లా సాధ్యమైన చోట్ల డ్రగ్స్ విక్రయం, సరఫరాపై కఠిన చర్యలు తీసుకుని విస్తృత తనిఖీలు చేయాలని, బాధితులను డీ-అడిక్షన్ సెంటర్లకు చేరవేసి అవసరమైన చికిత్స అందించాలని నిర్ణయించారు. కార్యక్రమంలో పాల్గొనినవారిలో డీఎస్పీలు నల్లపు లింగయ్య, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఇంచార్జి డీఎస్పీ బుచ్చయ్య, డీఎంహెచ్‌వో జయచంద్ర మోహన్, సీఐలు శివశంకర్, రామ్‌లాల్, సైదులు, భగవంత్ రెడ్డి, ఎస్ఐలు వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

## బోనమెత్తిన12వ వార్డ్ కౌన్సిలర్ సరస్వతమ్మ

అక్షర కలం, అందోలు



సంగారెడ్డి జిల్లా అందోల్-జోగిపేట మున్సిపల్ పరిధిలోని 12వ వార్డులో గురువారం ఆషాఢ మాసం బోనాల పండుగ కిందిగల్లిలో మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు (నాని) ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. వార్డులో పెద్దఎత్తున మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు చప్పుల మధ్య శివసత్తుల నృత్యాలతో మధ్యరాంగం గౌని చౌరస్తా మీదుగా శ్రీపోచమ్మ దేవాలయం వరకు చేరుకొని అమ్మవారికి బోనం సమర్పించుకుని ప్రత్యేక మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ కోరబోయిన నాగరాజు మాట్లాడుతూ ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా ఆషాఢ మాసం బోనాల పండుగ పురస్కరించుకొని వార్డులో మహిళలు, యువకులు భక్తి పారవశ్యంతో బోనాల పండగ జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. అలాగే మంగళవారం పోచమ్మ తల్లి తొట్టెల ఊరేగింపు ఉంటుందని ఆరోజు కూడా ప్రత్యేకంగా అలంకరించిన తొట్టెల కార్యక్రమం హైదరాబాద్ నుండి ప్రత్యేకంగా వస్తున్న పోతురాజుల, శివసత్తుల, కోలాహలం మధ్య నిర్వహించడం జరుగుతుందని ఆరన వివరించారు. ఈ బోనాల ఉత్సవాల్లో ఏరియా పెద్దలు, యువకులు, పిల్లలు వర్షంలో సైతం పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

## జూరాలకు పోటెత్తిన వరద -12 గేట్ల ద్వారా నీటి విడుదల

గద్వాల టౌన్, అక్షర:

ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతున్నది. దీంతో గురువారం జూరాల ప్రాజెక్టు దగ్గర ఇరిగేషన్ ఆఫీసర్లు 12 గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం జూరాల ప్రాజెక్టు దగ్గర 317.51 మీటర్ల లెవెల్ నీరు నిల్వ ఉన్నది. ఈ ప్రాజెక్టుకు 94,733 క్యూసెక్కుల నీరు ఇన్ఫ్లోగా వస్తున్నది. కర్ణాటకలోని నారాయణపూర్ డ్యామ్ దగ్గర 491.55 మీటర్ల లెవెల్ నీరు నిల్వ ఉంచుకున్నారు. 1,11,064 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ఈ ప్రాజెక్టుకు 95,043 క్యూసెక్కుల నీరు ఇన్ఫ్లో గా ఉన్నది. జూరాల ప్రాజెక్టు దగ్గర 317.51 మీటర్ల లెవెల్ నీటిని నిలువ ఉంచుకొని 12 గేట్లను ఎత్తివేసి నీటి విడుదల చేస్తున్నారు. గేట్ల ద్వారా 47,196 క్యూసెక్కులు, విద్యుత్ ఉత్పత్తి ద్వారా 38,225 క్యూసెక్కులు, నెట్టెంపాడు లిఫ్ట్ కు 750, బీమా లిఫ్ట్-1కి 1300, కోయిల్ సాగర్ లిఫ్ట్ కు 315, లెఫ్ట్ కెనాల్ కు 870 రైట్ కెనాల్కు 500 ల్యారలల్ కెనాల్ కు 600, బీమా లిఫ్టు-2కు750 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కర్ణాటక ప్రాజెక్టు నుంచి జూరాల ప్రాజెక్టుకు 94,733 క్యూసెక్కుల నీరు ఇన్ఫ్లోగా వస్తుండగా జూరాల ప్రాజెక్టు నుంచి89,799 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

## జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించి ఆన్ లైన్ బహిరంగ వేలం



గద్వాల్ టౌన్ అక్షరకలం:
గురువారం దేవాదాయ శాఖ కమిషనర్ వారి కార్యాలయము హైదరాబాద్ నందు శ్రీ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించి నిర్వహించిన సీల్డ్, ఆన్ లైన్, బహిరంగ వేలం నందు వాహనముల పార్కింగ్ రుసుము వసూలు చేసుకొను హక్కు పొందుటకు గాను 6 మంది డిపాజిట్ చెల్లించి వేలం నందు పాల్గొనగా శ్రీ బి. సురేష్ కుమార్, హైదరాబాద్ గారు అందరి కన్నా హెచ్చుపాట పాడి రూ.79,25,000-00 లకు ఈ వేలం పాటను దక్కించుకున్నారు. ఈ మొత్తము గత సంవత్సరము కంటే రూ.9,25,000-00 అదనంగా వచ్చినది. ఈ వేలం శ్రీయుత కమీషనర్, దేవాదాయ-ధర్మాదాయ శాఖ, హైదరాబాదు వారి ఉత్తర్వులకు లోబడి వుంటుంది. మిగిలిన టెంకాయలు పూజా సామాగ్రి అమ్ముకోను హక్కు పొందుటకు మరియు చీరల నిర్వహణ హక్కు పొందుటకు నిర్వహించిన సీల్డ్, ఆన్ లైన్ ఒ బహిరంగ వేలం నందు గత సంవత్సరము కంటే హెచ్చు పాట రానందున ఈ వేలం పాటను తిరిగి నిర్వహించుటకు వాయిదా వేయనైనది. ఈ వేలం పాటలు రంగారావు ఈఓ పర్యవేక్షణలో నిర్వహించ బడినవి. ఈ కార్యక్రమము నందు ఆలయ ఈ.ఓ. దీప్తి, సిబ్బంది పాల్గొన్నారు.

## మానవ అక్రమ రవాణాపై విద్యార్థులకు అవగాహన



కరీంనగర్, జూలై 30 ( అక్షర కలం ):
ప్రపంచ మానవ అక్రమ రవాణా నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా పరిషత్ పాఠశాల ఆరెపల్లిలో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మానవ అక్రమ రవాణా నిర్మూలన ఎస్సై మాట్లాడుతూ ప్రేమ పేరుతో మోసాలు, మత్తు పదార్థాలకు బానిస చేసి యువతను అక్రమ రవాణా చేస్తున్న ఘటనలపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండి ఆటలు ఆడి శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ ఆవుల సంపత్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం శ్రీలత, కమ్యూనిటీ కోఆర్డినేటర్ తిరుపతి, ఇన్‌చార్జి హెచ్‌ఎం డా. డిబోరా కృపారాణి, ఏఎస్సై మల్లేశం, షీటీం సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## తెలంగాణ జలసిరి పథకంపై అవగాహన కార్యక్రమం...



వీణవంక, జులై30 ( అక్షర కలం ) :
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న "తెలంగాణ జలసిరి" పథకం ద్వారా ప్రతి గ్రామానికి శాశ్వత నీటి వనరులు కల్పించడం, భూగర్భ జలాలను పెంపొందించడం, రైతులకు సాగునీటి సౌకర్యాలను మెరుగు పరచడం లక్ష్యంగా చర్యలు చేపడుతోంది. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డిఆర్డిఓ అధికారి ఈ నేపథ్యంలో జలసిరి పథకానికి సంబంధించిన వివరాలతో రూపొందించిన అవగాహన పోస్టర్‌ను సర్పంచులు, అధికారులు ఆవిష్కరించారు ఈ పోస్టర్‌లో ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్లు, పర్కొలేషన్ ట్యాంకులు, చెక్ డ్యాంలు, రీచార్జ్ షాఫ్ట్‌లు వంటి నీటి సంరక్షణ పనుల ద్వారా భూగర్భ జలాల పెంపు, వర్షపు నీటి నిల్వ, సాగునీటి వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా డిఆర్డిఓ గీత మాట్లాడుతూ, గ్రామాల్లో నీటి సంరక్షణ చర్యలను ప్రజలందరూ భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని, వర్షపు నీటిని వృథా కాకుండా భద్రపరచడం ద్వారా భవిష్యత్ తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న జలసిరి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో ముద్దసాని రమేష్, ఎంపీడీవో రవి సుధాకర్, ఎంపీఓ ప్రభాకర్ సంబంధిత అధికారులు సర్పంచులు, పంచాయతి కార్యదర్సులు సంబంధిత అధికారులు పాల్గొన్నారు

# భారీ వర్షాల నేపథ్యంలో అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండాలి

**-రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు**

అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, జూలై 30:
రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అన్ని జిల్లాల యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. గురువారం హైదరాబాద్ నుండి డిజిపి సివి ఆనంద్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులతో ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న వర్ష పరిస్థితులు, చేపట్టవలసిన చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు మాట్లాడుతూ, జిల్లా స్థాయిలో 24ఐ7 పని చేసే కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) బృందాలను ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోని వరద ప్రభావిత ప్రాంతాలలో మోహరించి పూర్తి అప్రమత్తంగా ఉంచామని తెలిపారు. భారీ వర్షాల కారణంగా సమాచార వ్యవస్థలు, కమ్యూనికేషన్ నెట్‌వర్క్‌లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, కూలిపోయే ప్రమాదంలో ఉన్న పాత భవనాలను గుర్తించి అవసరమైన జాగ్రత్తలు చేపట్టాలని తెలిపారు. నీటిపారుదల శాఖ అధికారులతో నిరంతర సమన్వయం కొనసాగిస్తూ జలాశయాలు, వాగులు, చెరువుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. లోతట్టు ప్రాంతాలలో నివసించే ప్రజలను ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, రహదారుల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ రాకపోకలకు అంతరాయం కలగకుండా తక్షణ చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ర్యాపిడ్ యాక్షన్ ప్లాన్ సిద్ధంగా ఉంచాలని తెలిపారు. పోలీసు శాఖతో కలిసి సంయుక్తంగా క్షేత్రస్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచిస్తూ, జీరో క్యాజువాలిటీస్ లక్ష్యంగా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. రాష్ట్ర డిజిపి మాట్లాడుతూ, జిల్లా పోలీసు అధికారులు తప్పనిసరిగా స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ఎస్‌ఓపీ)ను అనుసరించాలని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 12 ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను మోహరించామని, అవసరమైన చోట ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు కూడా సహాయక చర్యలకు సిద్ధంగా



ఉన్నాయని తెలిపారు. జిల్లా స్థాయిలో పోలీసు శాఖ ఇతర శాఖలతో సమన్వయంగా పని చేసి ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాలను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లాకు కేటాయించిన ఎన్డిఆర్ఎఫ్, ఎస్డిఆర్ఎఫ్. బృందాల సభ్యులను సమన్వయం చేసుకొని ప్రజా రక్షణ చర్యలు చేపడుతామని తెలిపారు. జిల్లాలోని వాగులు, నదులు, కల్వర్టుల వద్ద బందోబస్తు చర్యలు చేపట్టి ప్రజలు అటువైపుగా వెళ్లకుండా నిఘా నిర్వహిస్తున్నామని, లోతట్టు ప్రాంతా లు, శిథిలావస్థ భవనాల ప్రజలను ముందస్తు చర్యలలో భాగంగా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిపి ఎ భాస్కర్, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలి.

గద్వాల్ జిల్లా అక్షర కలం ప్రతినిధి
ప్రస్తుతం ఉపరితల వాతావరణ మార్పుల ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నప్పటికీ, ఎల్‌నినో ప్రభావం కారణంగా ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు సూచిస్తున్న నేపథ్యంలో రైతులు పంటల ఎంపికలో అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు వరి సాగు విషయంలో జాగ్రత్తలు పాటించాలని, నీటి లభ్యత తక్కువగా ఉండే చోట ఆరుతడి పంటలు సాగు చేయాలన్నారు. బోర్లు, బావులు, ఇతర వనరుల ద్వారా పంట కాలమంతా భరోసా కలిగిన నీటి లభ్యత ఉన్న రైతులు మాత్రమే వరి సాగు చేపట్టాలని తెలిపారు. తగినంత నీటి వనరులు లేని రైతులు వరి సాగుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను నివారించవచ్చున్నారు. రైతులు తమ వ్యవసాయ క్షేత్రాల్లో పంట కుంటలను నిర్మించుకోవాలని, ఫలితంగా వర్షాలు మందగించినప్పుడు నీటి కుంటల్లో నిలువ చేసుకున్న నీళ్లను పంటలకు పారించుకోవచ్చున్నారు. జిల్లాలో కూరగాయల సాగుతో పాటు ఆయిల్ పామ్ తోటల విస్తీర్ణాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. ఆయిల్ పామ్ పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నందున రైతుల సద్వినియోగం చేసుకోవాలన్నారు. వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ, వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు, సూచనలను అనుసరించి పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు ఈ



సందర్భంగా జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

# భారీ వర్షాలు.. నేడు జిల్లాలో అన్ని పాఠశాలలకు సెలవు

కరీంనగర్, జూలై30( అక్షర కలం ):
కరీంనగర్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా ఆదేశాల మేరకు జూలై 31 జిల్లాలోని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ సహా అన్ని పాఠశాలలకు సెలవు అని జిల్లా విద్యాశాఖ అధికారి చైత్యన్య జైన్ తెలిపారు. ఈ సెలవుకు బదులుగా ఆగస్టు 8 రెండో శనివారం పని దినంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, ఇప్పటికే షెడ్యూల్ ప్రకారం నిర్ణయించిన ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాలు యథావిధిగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.



# భారీ వర్షాల హెచ్చరిక

**-జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలి**
**-కలెక్టర్లు, ఎస్పీలతో సీఎస్ సంజయ్ జాజు**
**-సెలవులు రద్దు, 24/7 కంట్రోల రూమ్‌ల ఏర్పాటుకు ఆదేశం**

ఉమ్మడి నల్గొండ బ్యూరో అక్షరకలం
రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో భారీ వర్షాలు కురుస్తుండడం, అలాగే తక్కిన ప్రాంతాలలో భారీ వర్షాలు వచ్చేందుకు అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. గురువారం అయన హైదరాబాద్ నుండి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో భారీ వర్షాల నేపథ్యంలో చేపట్టాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకొని జిల్లా యంత్రాంగాలు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యేకించి అధికారులెవరు సెలవు పై వెళ్లవద్దని, అందరు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. భారీ వర్షాలను దృష్టిలో ఉంచుకుని అన్ని జిల్లాలలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని, ఇరిగేషన్ ప్రాజెక్టులు, చెరువులు, కుంటలు ,రహదారులు అన్నిచోట్ల అప్రమత్తం చేయాలని, ఎక్కడైనా పడిపోయేందుకు అవకాశం ఉన్న గృహాలు,



భవనాలను గుర్తించి అక్కడి వారిని ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలలో ఉంచేలా చూడాలని, వర్షాల వల్ల ప్రజలు పడకుండా వైద్య ఆరోగ్యశాఖ అప్రమత్తంగా ఉండాలని ఓఆర్ఎస్ పాకెట్లు, పాము, తేలుకాటు వంటి వాటికి మందులను సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. విద్యుత్తు, తాగునీటి సరఫరాలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖలు అప్రమత్తంగా ఉండాలని, భారీ వర్షాలలో ప్రజలకు సహకరించేందుకుగాను ఎస్ డి ఆర్ ఎఫ్, ఎన్ డి ఆర్ ఎఫ్ టీములను సిద్ధంగా ఉంచడం జరిగిందని ,భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ఎలాంటి ప్రాణ నష్టం,ఆస్తి నష్టం సంభవించకుండా చూడాల్సిన అవసరం ఉందని, ఇందుకు జిల్లా కలెక్టర్, ఎస్పీలు సమన్వయంతో పని చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ మాట్లాడుతూ భారీ వర్షాల నేపథ్యంలో జిల్లాలోని అన్ని స్థాయిల అధికారులు కార్య స్థానాలు వదిలి వద్దని, ఎవరు సెలవు పై వెళ్ళరాదని ఆదేశించారు.



భారీ వర్షాలు కురిసేందుకు అవకాశం ఉందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పని చేసేలా కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, ఈ కంట్రోల్ రూమ్ లో సమాచారం అందించేందుకు ఫోన్ నెంబర్ 1800 425 1442 ను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. భారీ వర్షాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు కలెక్టర్ కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ కి తెలియజేయాలని ఆయన కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. తాగునీరు, విద్యుత్తు సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జే. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ ప్రేమ్ కరణ్ రెడ్డి, శిక్షణ సహాయ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డిఆర్ఓ ఆర్ .దశరథ, సిపిఓ శ్రీనివాస్ నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, ఉద్యాన శాఖ అధికారి టి. శేఖర్, తదితరులు ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.

Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda-508 001 (Telangana) Printed at Pittale Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda 508 001. (Telangana) Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955